ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 15 డిసెంబరు 2024



చక్రాయపేట మండలం కాలేటివాగు సాగునీటి సంఘాలకు ఎన్నికైన టీడీపీ మద్దతుదారులు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరుమాసాలైంది. వైసీపీ నుంచి అధికారం మారిన ఆరు నెలల తర్వాత తొలిసారిగా జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వమే సత్తాచాటింది. వైసీపీ పోటీచేయకుండా ఈ ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటన చేసింది. నువ్వు నేర్పిన విద్యయే నీరజాక్ష.. అనేరీతిన ఐదేళ్ల జగన్ హయాంలో అమలు చేసిన ఫార్ములాను పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, జమ్మలమడుగులో బాబాయ్, అబ్బాయ్‌లు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అమలు చేశారు. దీంతో నోడ్యూస్ సర్టిఫికెట్లు తీసుకునేందుకు కూడా వైసీపీ ఉక్కిరి బిక్కిరి అయింది. పులివెందులలో వైఎస్ ఫ్యామిలీ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఇంత వన్‌సైడ్‌గా ఏకగ్రీవం కావడం ఇదే తొలిసారి.

# వైసీపీ హ్యాండ్సప్

- 202 సాగునీటి సంఘాలు టీడీపీ కూటమి పరం
- వైసీపీకి ఒకే ఒక్కటి
- పులివెందులలో తొలిసారి టీడీపీ హవా
- జగన్ శిబిరానికి పెద్ద దెబ్బే

కడప, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కామసముద్రం సంఘానికి నామినేషన్ వేసేందుకు వైసీపీ మద్దతుదారులు వచ్చారు. అయితే వారికి నోడ్యూస్ సర్టిఫికెట్లు లేవు. దీంతో పోలింగ్ అధికారులు వారి నామినేషన్లను తిరస్కరించారు. ఈ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. చివరకు పోలీసులు రంగప్రవేశం చేయడంతో వైసీపీ వారు వెనుదిరిగారు. జిల్లాలో మొత్తం 208 నీటి సంఘాలు ఉన్నాయి. కోగటం 1, 2 సంఘాలు మైలవరం చివరి ఆయకట్టు పరిధిలో ఉండేవి. ఎత్తిపోతల పథకాల ఏర్పాటుతో ఈ రెండు సంఘాల ఎన్నికలపై సందిగ్ధం నెలకొంది. చివరకు 203 సంఘాలకు అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 202 సంఘాలు టీడీపీ మద్దతుదారుల పరం కాగా.. ఒక్కటి మాత్రమే వైసీపీ ఖాతాలో పడింది.

**వైసీపీ బాటలోనే..**

సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలంటే నీటి తీరువా పన్నులు చెల్లించినట్లు నోడ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వాలి. అలాగే వీరిపై క్రిమినల్ కేసులు ఉండకూడదు. జగన్ హయాంలో రాష్ట్రంలో ఏ ఒక్క ఎలక్షన్ కూడా ప్రజాస్వామ్యబద్ధంగా సాగలేదు. బెదిరించడం, ఏకగ్రీవం చేసుకోవడమే సాగుతూ వచ్చింది. ఈసారి పులివెందులకు చెందిన మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి జగన్ ఫార్ములాను ఆయన సొంత నియోజకవర్గంలోనే ప్రయోగించారు. శుక్రవారం వేములలో టీడీపీ, వైసీపీ మధ్య పెద్ద ఘర్షణ జరిగింది. ఇక జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియంలో కూడా ఇదే సీన్ చోటుచేసుకుంది. ఎంపీ అవినాశ్‌రెడ్డిని వేములలో అడ్డుకోవడంతో కర్మ ఎవరినీ వదలదు అన్నట్లుగా మారడంతో వైసీపీ హ్యాండ్సప్ అయింది. ఈ ఎన్నికలకు పార్టీ గుర్తుతో జరగవు. లోకల్‌గా ఆ నీటి సంఘం పరిధిలో రైతులే సభ్యులను, ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు.

**పులివెందులలో వైసీపీకి మైనస్**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబీకులు 1978లో రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి నుంచి పులివెందుల జనం వారికి బ్రహ్మరథం పడుతున్నారు. సమితి ఎన్నికలు, అసెంబ్లీ.. ఏ ఎన్నిక జరిగినా సరే వార్ వన్‌సైడ్‌గా ఉండేది. టీడీపీ ఆవిర్భావం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో అరకొర పోటీ చేసేవారు. అలాంటి వైఎస్ కోటకు 2016లో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి చేతిలో బీటలు పడ్డాయి. ఈ ఏడాది జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో జగన్‌పై బీటెక్ రవి పోటీచేసి ఓడిపోయారు. అయితే ఆరు నెలల తర్వాత ఆయన మార్క్ చూపించేసి సాగునీటి సంఘాలను కైవసం చేసుకున్నారు. చక్రాయపేట-7, వేంపల్లెలో-6, పులివెందులలో-2, వేముల-6, సింహాద్రిపురం-5, తొండూరు-5, లింగాల-1 చొప్పున మొత్తం 32 సంఘాలను కైవసం చేసుకున్నారు. వైసీపీ ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పినప్పటికి దీనిని ఆ పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. కాగా కొన్నిచోట్ల ప్రాథమిక సభ్యుల ఎన్నికకు సంబంధించి తగినంత మంది ఓటర్లు రాకపోవడంతో అక్కడ ఎన్నికలు వాయిదాపడ్డాయి.

## పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

కడప జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



**వైద్యానికి దారి తీసిన విధానం**

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. శీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

**15, 16, 17,** తేదీల్లో కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన, ఎస్.పి బంగళా ఎదురుగా, హరితా హోటల్, ఏపి టూరిజం, కడప నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి ఛార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును. ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేకపోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

**మల్లి చేతిలో దివ్యమైన మూలికలు**

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

## కంటిచూపు పోతోంది

- చిన్నపిల్లల్లో మయోఫియా వ్యాధి
- 1-15 ఏళ్ల పిల్లల్లో 50 శాతం మందికి
- ఇందులకు తల్లిదండ్రులూ కారణమే

6

## జగన్‌కు ఝలక్..!

- సైకిలెక్కేందుకు 15మంది కార్పొరేటర్లు సిద్ధం?
- త్వరలో టీడీపీలో చేరికలు

వైసీపీ అధినేత జగన్‌కు సొంత జిల్లా కేడరే ఝలక్ ఇస్తోంది. ముఖ్యంగా పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఫ్యాన్‌కు బైబై చెప్పి సైకిలెక్కుతున్నారు. ఇప్పటికే ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కొన్ని వలసలు జరిగాయి. ఇప్పుడు కడప కార్పొరేషన్‌లోనే ఏకంగా 15 మంది కార్పొరేటర్లు జగన్‌కు బైబై చెప్పి సైకిల్ ఎక్కేందుకు సిద్ధమయ్యారు.

కడప, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో 50 మంది కార్పొరేటర్లు ఉండగా ఒకరు టీడీపీ, ఒకరు ఇండిపెండెంట్. 48 మంది వైసీపీ వాళ్లే. ఇండిపెండెంట్ కూడా వైసీపీలో కలిసిపోయారు. ఆరు నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందే పలువురు కార్పొరేటర్లు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపారు. కొందరు బ్యాక్‌డోర్‌లో టీడీపీ గెలుపునకు సహకరించారు. కడప ఎమ్మెల్యేగా ఆర్.మాధవి గెలిచారు. అనంతరం పలువురు కార్పొరేటర్లు టీడీపీలోకి వస్తామని చెప్పినప్పటికి ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆమె భర్త ఆర్.శ్రీనివాసరెడ్డి సుముఖత వ్యక్తం చేయలేదు. అయితే కార్పొరేషన్ రెండవ సమావేశంలో ఎమ్మెల్యే మాధవికి మేయర్ పక్కన సీటు కేటాయించక పోవడం తెలిసిందే. కార్పొరేషన్‌లో ఏ బిల్లు పాస్‌కావాలన్నా ఏం చేయాలన్నా కార్పొరేటర్లు అవసరం. ఆలస్యంగా మాధవి, శ్రీనివాసరెడ్డి అండ్‌కోకు ఈ విషయం అర్థమైంది. తొలుత వస్తామన్న కార్పొరేటర్లపై వీరు మళ్లీ ఫోకస్ పెట్టారు.

**వారం వారం చేరికలు ఉండేలా**

కడప వైసీపీలో జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాధరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, మేయర్ సురేశ్‌బాబు మధ్య మూడుముక్కలాట నడుస్తోంది. కడప అసెంబ్లీ స్థానంపై రవీంద్రనాధరెడ్డి ఎప్పటి నుంచో కన్నేశారు. ఇటీవలే మేయర్ సురేశ్‌బాబుకు జిల్లా అధ్యక్ష పదవిని తొలగించి ఆయనకు కట్టబెట్టారు. ఇప్పుడు కార్పొరేషన్‌లో రవీంద్రనాధరెడ్డి, మేయర్‌ల వర్గాలుగా పలువురు కార్పొరేటర్లు ముద్రపడ్డారు. మేయర్ సురేశ్‌బాబు అనుచరుడిగా ముద్రపడ్డ సూర్యనారాయణ ఇప్పటికే టీడీపీలో చేరారు. ఇపుడు మేయర్, మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా అధ్యక్షుడి వర్గంగా ముద్రపడ్డ కొందరు కార్పొరేటర్లు టీడీపీ గూటిలో చేరేందుకు సిద్ధమైనట్లు చెబుతారు. ముఖ్యంగా రెడ్డి కార్పొరేటర్లుగా ఉంటున్న కొందరు టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో టచ్‌లోకి వెళ్లి పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు సమాచారం. సుమారు 15 మంది కార్పొరేటర్లు సైకిల్ ఎక్కనున్నారని తెలుస్తోంది. వీరందరిని ఒకేసారి కాకుండా వారంవారం టీడీపీలో చేరే విధంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్లాన్ చేసినట్లు చెబుతారు. ఈ విషయం తెలిసి ఎంపీ అవినాశ్‌రెడ్డి కడపలోని తన స్వగృహానికి రావాలంటూ పలువురికి ఫోన్ చేశారు. కార్పొరేటర్లు సురేష్, షఫి, బాలస్వామిరెడ్డి, మక్బుల్ మరికొందరు కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఐదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు తమను ఎవరు పట్టించుకోలేదని వారు అన్నారు. అంజద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబుపై కొందరు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆ తర్వాత ఎంపీ అవినాశ్‌రెడ్డి అంజద్‌బాషా, సురేశ్‌బాబుతో ప్రత్యేకంగా సమావేశమైనట్లు చెబుతారు. ఈ సమయంలోనే పార్టీ మారుతున్న ఇద్దరు కార్పొరేటర్ల కుటుంబ సభ్యులు ఫోన్‌చేసి.. అన్నా మేము పార్టీ మారుతున్నాం.. మేము ఎక్కడున్నా మీ వాళ్లమే, మీ బ్లెస్సింగ్ కావాలంటూ ఫోన్‌లో కోరడం చూసి వైసీపీ నేతలు అవాక్కయ్యారంటారు. వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నారనే విషయాన్ని పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిని ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా అవును నిజమే అన్నారు. ఆరు నెలల చంద్రబాబునాయుడు పాలన చూసి కార్పొరేటర్లు స్వచ్ఛందంగా వస్తున్నారని అన్నారు.

## పోలీసులను అడ్డుపెట్టుకోవడం ప్రభుత్వ చేతగానితనం : ఎంపీ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీసులను అడ్డుపెట్టుకుని ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వం చేతగానితనాన్ని తెలియజేస్తోందని కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి తెలిపారు. శనివారం కడప నగర శివార్లలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి సంఘాల ఎన్నికలు అప్రజాస్వామ్యంగా జరిగాయన్నారు. ఎన్నికలు కోరుకునే వారైతే ప్రతి రైతుకు నో డ్యూస్ సర్టిఫికేట్ ఇచ్చేవారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగి ఉంటే బీటెక్ రవిని రైతులు చొక్కా విప్పేవారన్నారు. ఖైదీలను బంధించినట్లు వీఆర్‌ఓలను ఎమ్మార్వో కార్యాలయంలో ఎందుకు బంధించారో తెలియజేయాలన్నారు. అధికార పార్టీకి రైతులు ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. జమ్మలమడుగులో వీఆర్వోలను దేవగుడిలో బంధించినది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

## బతుకు భారమై.. ఆటో నడుపుతూ..

- ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ
- రుణం ఇప్పించాలని వేడుకుంటున్న గిరిజన మహిళ

6



## జానమద్ది అభినందనీయులు

- భాషాభివృద్ధి కోసం జీవితం ధారపోసిన బ్రౌన్
- జానమద్ది శతజయంతి స్మారకోపన్యాసంలో జస్టిస్ ఎన్వీ రమణ



సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు సత్కారం

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికోసం సీపీ బ్రౌన్ జీవితం ధారపోశారని.. ఆయన బాటలోనే పయనించిన జానమద్ది హనుచ్ఛాస్త్రి అభినందనీయులని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో శనివారం బ్రౌన్ గ్రంథాలయంలో కీర్తిశేషులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 'తెలుగు భాష వైభవం' అనే అంశంపై జస్టిస్ ఎన్వీ రమణ ప్రసంగించారు. వేరే దేశం నుంచి ఉద్యోగ రీత్యా ఇక్కడికి వచ్చిన బ్రౌన్ తెలుగు భాష నేర్చుకుని ఈ భాష అభివృద్ధి కోసం జీవితాన్ని ధారపోశారన్నారు. కడపలో బ్రౌన్ గ్రంథాలయం ఏర్పాటుచేసిన హనుమచ్ఛాస్త్రి, ఆ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న ఆయన కుటుంబ సభ్యులు అభినందనీయులన్నారు. తెలుగు భాష దాదాపు సింధూ నాగరికతతో సమానంగా అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పుడు అందరూ ఉద్యోగ ఉపాధి కోసం ఇంగ్లీష్‌కి అలవాటు పడుతున్నారన్నారు. ఎన్నో దేశాలలో ఇప్పటికీ వారి మాతృభాషలోనే బోధన జరుగుతుందన్నారు. మాతృభాషలో ఉన్న అంశాలను నేర్చుకుంటే ఇతర భాషలు నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కనీసం మనం ఇంట్లోనైనా పిల్లలతో తెలుగు మాట్లాడాలని కోరారు.

అనంతరం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ బ్రిటీష్ వారికి సంబంధించిన వ్యక్తి ఒక భాషపైన మక్కువతో తెలుగు భాషకు ఎనలేని సేవలు అందించారని ఆమె కొనియాడారు. మరో ప్రత్యేక అతిథి ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ సుమతి శతకం, వేమన పద్యాలు తెలుగులో ఉన్న వాటిని బ్రౌన్ ఇంగ్లీష్‌లోకి అనువదించారన్నారు. 11వ శతాబ్దం కంటే ముందే తెలుగుభాష పుట్టిందన్నారు. బ్రౌన్ గ్రంథాలయం ఏర్పాటు కోసం జానమద్ది హనుమచ్ఛాస్త్రి చేసిన సేవలు మరువలేనివన్నారు. కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు ఆలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ సాహితీ సంస్థల వల్ల కడపకు ఒక గుర్తింపు వచ్చిందన్నారు. జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని అందుకు ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. అంతకు ముందు బ్రౌన్ గ్రంథాలయంలోని హనుమచ్ఛాస్త్రి, గ్రంథాలయ స్థల దాత సంపత్ కుమార్‌ల విగ్రహాలకు జస్టిస్ ఎన్వీ రమణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు, ఇంగ్లీష్ తాళపత్ర విభాగాలను సందర్శించారు. సమావేశం అనంతరం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను బహూకరించారు. జస్టిస్ ఎన్వీ రమణకు బ్రౌన్ గ్రంథాలయ గౌరవ సభ్యత్వ గుర్తింపు కార్డును, పుస్తకాలను బహూకరించారు. అనంతరం జస్టిస్ దంపతులను ఘనంగా తస్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, పలువురు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

## ఆహారంలో కల్తీ కనపడితే కఠిన చర్యలు

- ప్రజల్లో చైతన్యంతోనే కల్తీ నివారణ సాధ్యం
- ఇన్‌చార్జి ఫుడ్ కంట్రోలర్ గరికపాటి ప్రభాకర్



ఫేస్ టు ఫేస్

కడప వినాయకనగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరుబయట నిత్యం తీసుకునే ఆహార పదార్థాల్లో కల్తీ కనపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఆహార భద్రతాధికారి గరికపాటి ప్రభాకర్ తెలిపారు. ప్రజారోగ్యంపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే కమిషన్‌కు సమాచారం అందించి ల్యాబ్ రిపోర్టు ఆధారంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

**ప్రశ్న:** కల్తీ ఆహారంతో ప్రజలు ఇబ్బంది పడితే ఏం చేస్తారు

**జవాబు:** మా దృష్టికి వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపి వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందిస్తాం. శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్ రిపోర్టు ఆధారంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

**ప్రశ్న:** ఎన్ని రోజులకు తనిఖీలు నిర్వహిస్తారు

**జవాబు:** జిల్లాలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. నెలలో 40 శాంపిల్స్ తీసుకురావాలి. ఇందులో హోటళ్లు, బేకరీలు, పండ్లు, వసతిగృహాలు, అంగన్వాడీ సెంటర్లు, మధ్యాహ్న భోజనం కూడా ఉంటుంది.

**ప్రశ్న:** సిబ్బంది కొరత ఉందా

**జవాబు:** కడప, అన్నమయ్య జిల్లాల్లో ఆరుగురు పని చేయాల్సి ఉంది. కానీ సిబ్బంది కొరతతో అన్నమయ్య జిల్లాలో ఒకరు, కడప జిల్లాలో ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు.

**ప్రశ్న:** రుచికోసం ఆహార పదార్థాల్లో వాడకూడనివి కూడా వాడుతున్నారు

**జవాబు:** ఆహార పదర్థాల్లో రంగులు వేయకూడదు. రంగులు వేశారని తెలిస్తే ల్యాబ్ రిపోర్టు ఆధారంగా క్రిమినల్ కేసులు నమోదు అవుతాయి. రంగులకు స్వీట్స్, బేకరీల వరకు అనుమతి ఉంది. ఐఎస్‌ఐ మార్కు ఉన్న రంగులను స్వీట్స్‌లో వాడుకోవచ్చు.

**ప్రశ్న:** కొన్ని హోటళ్లల్లో ఫ్రిజ్‌లలో పెట్టి మరుసటి రోజు వాడుతున్నారు


**జవాబు:** అలాంటివి తెలిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా వంటగదులు పరిశుభ్రంగా ఉండాలి.

**ప్రశ్న:** కాయలను మాగబెట్టేదానికి కార్బోహైడ్రేడ్స్ వాడవచ్చా

**జవాబు:** మనం తినే ఎలాంటి కాయ కానీ, పండ్లలో కార్బోహైడ్రోడ్స్ వాడడం నేరం. కాయలను ఒక గదిలో ఉంచి ఇథలిన్ గ్యాస్ కానీ సాంబ్రాణి పొగకానీ వేయాలి. వెంటనే కాయలు రంగు రావాలని కార్బోహైడ్రేడ్ వాడుతున్నవారిపై కేసులు నమోదు చేశాము ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే కల్తీ పదార్థాలు దూరమవుతాయి.

## జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ప్రతి రంగంలో 15శాతం వృద్ధి టార్గెట్
- కలెక్టర్ల సదస్సులో జిల్లా అభివృద్ధిపై సీఎం దిశానిర్దేశం
- వైసీపీ హయాంలో జరిగిన డ్యామేజీని సరిచేసే యత్నం



కడప, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పని మొదలు పెట్టింది. ఐదేళ్ల జగన్ హయాంలో కాకులను కొట్టి గద్దలకు వేసినట్లుగా పన్నులు పెంచేసి అందరినీ బాదేసి అలా వచ్చిన సొమ్ముతో పథకాల పేరిట కొందరికి పంచిపెట్టారు. అభివృద్ధి ఊసే లేకుండా పోయింది. జిల్లా కేంద్రమైన కడపలో కనీసం తాగునీటి సమస్య కూడా పరిష్కరించలేక పోయారు. ఈ నేపథ్యంలో అటు పరిపాలనను గాడిలో పెట్టడంతో పాటు ఇటు అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర 2047 విజన్ తయారు చేశారు. ఇందులో భాగంగా రాబోయే ఐదేళ్లలో ప్రతి రంగంలో 15శాతం వృద్ధే లక్ష్యంగా ప్రణాళిక వేసుకున్నారు. ఆ లక్ష్యాలను చేరేందుకు రూట్‌మ్యాప్ తయారుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రెండు రోజులపాటు అమరావతిలో కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సదస్సులో వివిధ రంగాల్లో జిల్లా ప్రోగ్రెస్ వెల్లడైంది. జిల్లా అభివృద్ధికి కొన్ని లక్ష్యాలను నిర్దేశించారు. వీటిలో కొన్నింటిని పరిశీలిస్తే..

- జగన్ హయాంలో భూకబ్జాలు ఇష్టారాజ్యంగా సాగాయి. జిల్లాలో 76,320 ఎకరాల భూములను ఫ్రీహోల్డ్ చేశారు. నిబంధనలు పాటించకుండా వైసీపీ నేతలు లాక్కున్న, ఆక్రమించిన భూములను కూడా ఫ్రీహోల్డ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిపై దృష్టి సారించింది. 10,125 ఎకరాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించారు. జిల్లాలో భూకబ్జాలు, పట్టాదారు పాసుబుక్కుల్లో ఒకరు, సాగులో ఒకరు, ఆన్‌లైన్‌లో ఒకరు ఇలా రకరకాల సమస్యలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 4,378 ఫిర్యాదులు వచ్చాయి. 12వ తేదీ గురువారం వరకు 2,760 పరిష్కరించారు.





సీఎం సదస్సులో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

- ప్రచార పిచ్చి కోసం భూములను రీసర్వే చేసి జగన్ బొమ్మతో ఉన్న రాళ్లను సరిహద్దు రాళ్లుగా పాతారు. 259 గ్రామాల్లో 3,11,006 రాళ్లపై జగన్ బొమ్మలు ఉన్నాయి. వాటిని తొలగించే పనికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 12వ తేదీ నాటికి 74,824 రాళ్లపై జగన్ బొమ్మలను తొలగించారు.
- కడప హజ్‌హౌస్ నిర్మాణం 2014-19లోనే చంద్రబాబు హయాంలో చేపట్టారు. 2019 మార్చి నెల నాటికి 80శాతం పనులు పూర్తయ్యాయి. మరో 20శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వేలాదిమంది ముస్లింలకు ఉపయోగపడే హజ్‌హౌస్‌ను జగన్ ప్రభుత్వం మూలన పడేసింది. మరోసారి అధికారం చేపట్టిన చంద్రబాబు దీనిపై దృష్టి సారించారు. ఇక్కడ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే భవనాన్ని వినియోగంలోకి తేనున్నారు. అలాగే పెద్ద దర్గాను మరింత అభివృద్ధి పరచనున్నారు.
- గండికోట సహజసిద్ధమైన పర్యాటక కేంద్రం. ప్రపంచంలోని టాప్ టెన్‌లో ఉంది. ఇక్కడున్న సహజసిద్ధమైన పెన్నాలోయ ప్రపంచంలోనే రెండోది. అయితే ఇక్కడకు వచ్చే పర్యాటకులకు ప్రామం వసతులు లేవు. అందుకే ఇక్కడ భారీ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. వీటికోసం 40 నుంచి 50ఎకరాల భూమి అవసరం అవుతుంది. ఈ మేరకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.
- వచ్చే మార్చి నెలాఖరుకు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి నుంచి వచ్చే మార్చిలోపు 1.20 లక్షల ఇళ్లను పూర్తిచేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లాలో 1,00,070 ఇళ్లను పూర్తిచేస్తున్నారు. 'మనిల్లు-మనగౌరవం' పేరిట ఈ నెల చివరి నాటికి 5వేల ఇళ్లు పూర్తిచేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే 40శాతం పూర్తిచేశారు. ఏప్రిల్ నుంచి పీఎం-2 స్కీం మొదలుకానుంది.
- జిల్లాలో 346 అంగన్వాడీ కేంద్రాల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.1.25 కోట్లు ఖర్చుచేస్తున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.444.16కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 39.97శాతం లక్ష్యం పూర్తయింది.
- జిల్లాలో 11 రహదారులకు సంబంధించి భూసేకరణ నత్తనడకన సాగుతోంది. ప్రధానంగా బెంగళూరు-కడప-విజయవాడ రహదారి నిర్మాణానికి భూసేకరణ అడ్డంకి గా మారింది. ఇవన్నీ త్వరగా క్లియర్ చేసి రహదారుల నిర్మాణం పూర్తి చేయనున్నారు.
- ఈ ఆరునెలల్లో సంక్షేమ హాస్టళ్ల మరమ్మతుల కోసం రూ.7.50కోట్లు ఖర్చుచేశారు. రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్యుల సంక్షేమానికి రూ.28.70కోట్లు ఖర్చుచేశారు. కాపు సంక్షేమం ద్వారా 1,821 మందికి రూ.15.9కోట్లు ఖర్చుచేశారు.
- మెప్మా పరిధిలో కడప కార్పొరేషన్‌లో 14,447 సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,23,524 మంది సభ్యులున్నారు. అయితే వారి జీవనగతుల్లో మన జిల్లా చివరిస్థానంలో ఉండడం గమనార్హం. వీరి అభివృద్ధికి కార్యాచరణ రూపొందించనున్నారు.
- ఇక వ్యర్థాల నిర్వహణలో రాష్ట్రంలో జిల్లా 8వ స్థానంలో ఉంది. పట్టణాల్లో 381 టన్నుల చెత్త పోగవుతోంది. వీధి కుక్కలకు స్టెమునైజేషన్‌లో కడప 20వ స్థానంలో ఉంది. జూన్ 1 నుంచి డిసెంబరు 4 వరకు 7,474 టార్గెట్ కాగా 1,350 వాటికి వ్యాక్సిన్ వేశారు.
- వీధి దీపాల విషయంలో రాష్ట్రంలో 12వ స్థానంలో ఉన్నాం. 51,891 లైట్లు ఉండగా 47,999 పనిచేస్తున్నాయి. 92.6శాతం లైట్లు పనిచేస్తున్నాయి.
- పల్లె పండుగ పేరుతో జిల్లాలో చేపట్టిన 994 పనులకు గాను 418 మాత్రయ్యాయి. మిగిలిన పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# కంటిచూపు పోతోంది

- చిన్నపిల్లల్లో మయోఫియా వ్యాధి
- 1-15 ఏళ్ల పిల్లల్లో 50 శాతం మందికి
- ఇందుకు తల్లిదండ్రులూ కారణమే

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో చిన్నపిల్లలకు కంటి చూపు తగ్గిపోతోంది. ఏడాది నుంచి 15 సంవత్సరాల చిన్నపిల్లలకు, తల్లిదండ్రులు మొబైల్ అలవాటు చేయడం వల్ల వారికి కంటిచూపు మందగించి మయోఫియా అనే జబ్బు భారిన పడి జీవితాంతం కంటి అద్దాలు వాడే పరిస్థితికి కొనితెచ్చుకుంటున్నారు. సెల్‌ఫోన్, టీవీలు గంటల తరబడి చూడడం వల్ల ఈ జబ్బు వస్తుందని నిపుణులు ఓ పరిశోధనలో వెల్లడించారు. ఒక్కసారి ఈ వ్యాధి వచ్చిన పిల్లలకు జీవితాంతం చూపు మందగిస్తూనే ఉంటుందని, వారు కంటి అద్దాలు వాడక తప్పదని డాక్టర్లు చెబుతున్నారు. సాధారణంగా చిన్నపిల్లలకు కంటి చూపు తక్కువ మోతాదులో ఉంటుంది. చిన్నపిల్లలకు గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, పాలు, పోషక పదార్థాలు పెట్టి కంటి చూపు పెంచుకోవడానికి ప్రయత్నం చేయకుండా తల్లిదండ్రులు సెల్‌ఫోన్ అలవాటు చేయడం వల్ల ఉన్న కంటి చూపుపోయి వారికి కంటి అద్దాలు తెచ్చుకునే పరిస్థితులు దాపురిస్తున్నాయని డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాల నుంచి కంటి అద్దాలు వాడే పిల్లలకు 40 సంవత్సరాల తర్వాత ఎటువంటి చూపు ఉండకపోవచ్చని ఒక పరిశోధనలో వెల్లడైనట్లు తెలిసింది. జన్యుశాస్త్రం ప్రకారం తల్లిదండ్రుల్లో ఒకరికి సైట్ వస్తే వారి పిల్లలకు అది మూడు రెట్లు ప్రభావం చూపుతుందని డాక్టర్లు ఒక అంచనాకు వచ్చారు.



రాజంపేటలో పిల్లలకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రభంజన్‌కుమార్ (ఫైల్)

### కంటి చూపు మందగించడానికి కారణాలు

చిన్నపిల్లలు బయట గ్రౌండ్‌లో ఆడుకోకపోవడం, స్కూల్ నుంచి ఇంటికి రాగానే సెల్‌ఫోన్ పట్టుకుని గంటల తరబడి చూడడం వల్ల ఈ మయోఫియా వ్యాధి వస్తుందని డాక్టర్లు పరిశోధనలో వెల్లడించారు. ఇందులో తల్లిదండ్రుల పాత్ర పూర్తిగా ఉన్నట్లు కూడా వారు అంచనాకు వచ్చారు. తల్లిదండ్రుల్లో ఒకరికి సైట్ వస్తే ఖచ్చితంగా వారి పిల్లల్లో ఒకరికి సైట్ వస్తుంది. సెల్‌ఫోన్‌లో వీడియోగేమ్, క్రికెట్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు అని రకరకాల దృశ్యాలను చూడడం వల్ల చిన్న పిల్లలు కంటి చూపు కోల్పోతారని కంటి వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు ఉద్యోగాల బిజీలో పడి పిల్లలకు సెల్‌ఫోన్లు అలవాటు చేయడం వల్ల ఐదేళ్ల లోపు పిల్లలు ఈ వ్యాధి భారిన పడి నరకం అనుభవిస్తున్నారని కంటి వైద్యనిపుణులు చెబుతున్నారు. చిన్నపిల్లలు కనీసం ఎండలో రెండు గంటల పాటు ఆడుకోవాలని వైద్య నిపుణులు కోరుతున్నారు. సాధారణ ప్రకృతి సూర్యరశ్మి వల్ల కంటి చూపు సమస్యలు రావని, ఒక వేళ వచ్చినా ఎక్కువ శాతం ప్రభావితం చూపవని వైద్యులు నిర్ధారించారు.

#### అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం చిన్న పిల్లల్లో కంటి వ్యాధులు ఎక్కువగా ఉన్న పరిస్థితులు మనం చూస్తున్నాం. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను కంటి డాక్టర్ దగ్గర పరీక్షలు చేయించాలి. పిల్లలను గారాబం చేసి సెల్‌ఫోన్‌లకు, టీవీలకు అలవాటు చేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు సెల్‌ఫోన్‌లకు అడిక్ట్ అయిపోతే అనంతరం తల్లిదండ్రులు బాధపడాల్సి వస్తుంది. ముందుగానే వాటిని చిన్నారులకు దూరంగా ఉంచేలా చూసుకోవాలి.

-డాక్టర్ కొండయ్య, డీఎంహెచ్‌వో, అన్నమయ్య జిల్లా

#### ఫోన్‌లు పిల్లలకు దూరంగా ఉంచాలి



చిన్నపిల్లలకు స్మార్ట్‌ఫోన్ అలవాటు చేయడం వల్ల వారు దగ్గర దృష్టి, దూర దృష్టి రెండు కోల్పోతారు. చిన్నపిల్లలకు పాలు, గుడ్లు, ఆకుకూరలు పండ్లతో పాటు మంచి విటమిన్స్ లభించే ఆహార పదార్థాలు ఇవ్వాలి. పానీపూరి, గోబి మంజూరియా, చాక్లెట్, బిస్కెట్స్, పిజ్జా అలవాటు చేయకూడదు. వారానికి రెండుసార్లు అయినా బయట ఎండలో ఆడుకునే విధంగా తల్లిదండ్రులు చూసుకోవాలి. అప్పుడే కంటికి సంబంధించిన వ్యాధులు రాకుండా నివారించవచ్చు.

- శ్రీనివాస్, రాయచోటి ఆర్డీవో

#### పిల్లలకు స్మార్ట్‌ఫోన్ అలవాటు చేయొద్దు



ఏడాది నుంచి 15 సంవత్సరాల వయస్సు గలవారికి స్మార్ట్‌ఫోన్ అలవాటు చేసి తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారు. కనీసం వారానికి మూడుసార్లైనా పిల్లలు బయట ఎండలో ఆడుకునే విధంగా తల్లిదండ్రులు చూసుకోవాలి. పిల్లలను గారాభం చేసి సెల్‌ఫోన్ అలవాటు చేయడం వల్ల వారికి కంటి చూపు మందగించి రాబోవు రోజుల్లో వారు అంధహీనులుగా మిగిలిపోతారు. ఈ విషయాన్ని ప్రతి తల్లి తండ్రి ఆలోచించి ముందు జాగ్రత్తగా పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వడం మానుకోవాలి.

- ప్రభంజన్‌కుమార్,
కంటి వైద్యనిపుణుడు, స్విమ్స్ తిరుపతి

## బతుకు భారమై..
# ఆటో నడుపుతూ..

- ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ
- రుణం ఇప్పించాలని వేడుకుంటున్న గిరిజన మహిళ



తన పిల్లలతో కలిసి ఆటోలో గంగమ్మ

కొండాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వం మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా అవి అందరికీ చేరడం లేదు. భర్త అనారోగ్యంతో ఉండటంతో కుటుంబ పోషణ భారమై ఆటో నడుపుతూ తోబుట్టువులు, తన తల్లిదండ్రులను పోషిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది గిరిజన మహిళ పగడాల గంగమ్మ.



పూరి గుడిసెలో నివాసం ఉంటున్న గంగమ్మ

### ఆటో నడిపి కుటుంబాన్ని పోషిస్తూ...

కొండాపురం మండలంలోని గండ్లూరు ఎస్టీ కాలనీలో గంగమ్మ కుటుంబం ఒక పూరి గుడిసెలో ఉంటోంది. గంగమ్మకు భర్త రవితో పాటు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. నలుగురు చెల్లెల్లు. ఒక తమ్ముడు ఉన్నాడు. తల్లిదండ్రులు అరుణ, గంగన్న ఉన్నారు. వీరంతా గంగమ్మతోనే ఉంటూ జీవనం గడుపుతున్నారు. భర్త రవికి తల్లిదండ్రులు లేకపోవడంతో గంగమ్మతో పాటు ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. గంగమ్మతో పాటు తండ్రి గంగన్న మాత్రమే కుటుంబాన్ని పోషిస్తున్నారు. భర్తకు అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు.

గంగమ్మ అమ్మ అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటోంది. తన తోబుట్టువులు నలుగురు చిన్నపిల్లలు. వీరిని బడిలో చేర్పించి చదువులు చెప్పిస్తోంది గంగమ్మ. తన పిల్లలు పసిపిల్లలు. దీంతో కుటుంబపోషణ భారం కావడంతో కూలీ పనులకు వెళ్లకుండా, తన తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి ఆటో నేర్చుకుంది. బతుకుబండి నడిపేందుకు తన బంధువుల వద్దనున్న పాత ఆటోను అద్దెకు తెచ్చుకుంది. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆటోలో కూలీలను పనులకు తీసుకెళుతూ, బడిపిల్లలను తన ఆటోలో తీసుకెళుతూ జీవనం సాగిస్తోంది. ఆటో నడుపుతూ రోజూ రూ.300 వరకు సంపాదిస్తూ నేటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. సంపాదన తక్కువ కావడంతో ప్రభుత్వం ఉపాధి కోసం తగిన ఆర్థిక సహాయం అందించాలని గంగమ్మ వేడుకొంటోంది.

### కాళ్లరిగేలా తిరిగినా రుణం లేదు..

గంగమ్మ ఇల్లు గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురయింది. దీంతో ఇల్లు కోల్పోయి పూరిగుడిసెలో నివాసం ఉంటోంది. పాత ఆటో బాడుగకు తీసుకొని నడుపుతోంది. ఆటో కోసం బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా తనకు బ్యాంకులు రుణం ఇవ్వలేదని గంగమ్మ కన్నీటి పర్యంతమవుతోంది. అంతేగాక గండికోట నిర్వాసితుల జాబితాలో తన పేరు చేర్చకపోవడంతో పరిహారం రాక పూరి గుడిసెలోనే నివాసం ఉన్నామంటూ చెబుతోంది గంగమ్మ.

### ప్రభుత్వం సహాయం అందించాలి..

గత ప్రభుత్వంలో పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా తనకు సహాయం అందలేదు. ఆటో కొనుక్కోవడానికి ఒక గిరిజన మహిళగా తనకు ప్రభుత్వ సహాయం అందించాలని వేడుకుంటోంది. పూరి గుడిసెలో ఉన్న తమకు ఇళ్లు, ఇళ్ల స్థలం ఇవ్వాలి. అదే విధంగా గండికోట ప్రాజెక్టు కింద పరిహారం ఇవ్వాలని గంగమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.

# జాతీయ మెగా లోక్‌అదాలత్ విజయవంతం







రాయచోటిలో లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా అయిదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, ఇతర జడ్జిలు - లోక్‌అదాలత్‌లో కేసులు విచారిస్తున్న జడ్జిలు

రాయచోటి టౌన్, డిసెంబరు 14 : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఐదవ జిల్లా అదనపు జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా 130 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు పరిధిలోని వివిధ మండలాల్లో జరిగిన యాక్సిడెంట్, చెక్‌బౌన్స్, సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించిన 130 కేసులను జిల్లా అయిదవ అదనపు జడ్జి కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానాలు పూర్తిస్థాయిలో విచారించి ఇరువర్గాలతో మాట్లాడి రాజీమార్గం ద్వారా 130 కేసులను పరిష్కరించి రూ.కోటి 84 లక్షల 53 వే 539 రూపాయలు జరిమానా విధించడంతో పాటు చెల్లింపులు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ వారు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

### బాధితులకు రూ.7.44 కోట్ల పరిహారం

మదనపల్లె టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోర్టులో శనివారం రాత్రి వరకు నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 313 కేసులు పరిష్కారమయ్యాయి. స్థానిక కోర్టు భవన సముదాయాల్లో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శిరీష్, రెండవ ఆదనపు మేజిస్ట్రేట్ కీర్తన, స్పెషల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ చలపతి ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో 44 సివిల్ కేసులు, 269 క్రిమినల్ కేసులు పరిష్కారం కాగా వీటిలో బాధితులకు రూ.7,44,33,578 పరిహారం చెల్లించారు.

### కేసుల సత్వర పరిష్కారం

వాల్మీకిపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా కేసులతో సతమతమవుతున్న కక్షిదారులకు సత్వర పరిష్కార వేదిక జాతీయ లోక్‌అదాలత్ అని వాల్మీకిపురం జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ గురు అరవింద్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంతో కక్షలకు పోయి కేసులతో జీవితాలను దుర్భరం చేసుకోకుండా ప్రతి ఒక్కరూ చట్టం, న్యాయాల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి నిత్యం కోర్టులలో సింగిల్‌సిట్టింగ్ నిర్వహించడం జరుగుతుందని కక్షిదారులు దానిని సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు, తదితర మొత్తం 144 కేసులు, నగదు రికవరీలు రూ.57,72,880 పరిష్కరించారు. కార్యక్రమంలో ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు రాంప్రసాద్‌రెడ్డి, న్యాయవాదులు, పోలీసులు, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

### లోక్‌అదాలత్ లో 115 కేసులు పరిష్కారం

తంబళ్లపల్లె, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో శనివారం న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, ఇన్‌చార్జ్ న్యాయమూర్తి విజయకుమార్‌రెడ్డి అధ్యక్షతన మెగా లోక్‌అదాలత్ జరిగింది. సీసీ(ఐపీసీ) సంబంధించిన కేసులు 20, సీసీ (అడ్మిషన్) కేసులు 6, ఎస్‌పీసీ (అడ్మిషన్) కేసులు 62, సీసీ ఎక్సైజ్ కేసులు 20, ఓయస్ పార్టిషన్ 4, ఓయస్ (పీఐ) రెండు కేసులు పరిష్కరించి రూ.3,59,545 ఫైన్ వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది రామచంద్ర, పోలీసులు, లోక్‌అదాలత్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

# సీటీఎం మిల్లు కార్మికులకు వేతనం మంజూరు

మదనపల్లె టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీటీఎం మిల్లులో పనిచేసిన కార్మికులకు 23 నెలల వేతనం మంజూరైనట్లు ఎంఎస్‌ఎం వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు వై.రాజారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిల్లు లాకౌట్ సమయంలో 311 మంది కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను కార్మికశాఖ కమిషనర్ మంజూరు చేశారని రాజారెడ్డి తెలిపారు.

# మంచు మృత్యువు

- శీతాకాలం...వాహనదారులకు పరీక్షా సమయం
- అవగాహన, అప్రమత్తతతో సురక్షిత ప్రయాణం

పీలేరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి ఏడాదిలో డిసెంబరు, జనవరి మాసాల్లో పొగమంచు అధికంగా ఉంటుంది. వరుస తుఫాన్‌ల కారణంగా ఈ ఏడాది మరింత ఎక్కువగా పొగమంచు కురుస్తోంది. పొగమంచు కారణంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. పొగమంచు ఉన్నప్పుడు రోడ్లపై డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరం. అందుకే చలికాలంలో డ్రైవింగ్ చేయడం అంత తేలికైన పనికాదు. పొగమంచు కారణంగా రోడ్లపై ఏమీ త్వరగా కనిపించదు. దీని కారణంగా ప్రమాదం మరింత ఎక్కువ అవుతుంది.

మీరు పొగమంచులో డ్రైవ్ చేయబోతున్నట్లైతే కొన్ని విషయాలను గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. శీతాకాలంలో డ్రైవింగ్ చేసేటప్పుడు కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు, మెలకువలు పాటించాలని, లేకపోతే ప్రమాదాల బారినపడే ప్రమాదం పొంచి ఉంటుందని రవాణా శాఖాధికారులు చెబుతున్నారు. పీలేరు ఎంవీఐ విజయకుమారి శీతాకాలంలో వాహనదారులు పాటించాల్సిన జాగ్రత్తలను కొన్ని వివరించారు.

### రాత్రి ప్రయాణం అస్సలే వద్దు....

చీకటి పడిన తరువాత నుంచి ఉదయం 7 గంటల వరకు దూర ప్రయాణాలు చేయకపోవడం మంచిది. ఆ సమయంలో విశ్రాంతి తీసుకుని బాగా ఎండ వచ్చాక ప్రయాణం ప్రారంభించడం ఉత్తమం.



పీలేరు-తిరుపతి మార్గంలో పొగమంచులో వాహనాలు

### నెమ్మదిగా డ్రైవ్ చేయాలి...

పొగమంచులో వాహనాలను వేగంగా నడపరాదు, నెమ్మదిగా నడపాలి. పొగమంచు కారణంగా రహదారిపై ముందు వెళ్లే వాహనాలు స్పష్టంగా కనిపించవు. కాబట్టి అధిక వేగం వల్ల ప్రమాద తీవ్రత పెరుగుతుంది. ముందు వెళ్లే వాహనాలకు మన వాహనానికి దాదాపు 100 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. మంచు పూర్తిగా తగ్గిన తరువాత సాధారణంగా వేగం పట్టుకుంటే గమ్యానికి సురక్షితంగా చేరుకోవచ్చు.



పీలేరు-కడప మార్గంలో...

### ఓవర్‌టేక్ చేయరాదు

దట్టమైన పొగమంచులో డ్రైవింగ్ చేసేటప్పుడు ఓవర్‌టేక్ చేయరాదు. పొగమంచులో దూరాన్ని నిర్ధారించడం కష్టం కాబట్టి ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరం. ముందున్న ఇతర వాహనాల డ్రైవర్లు పరధ్యానంలో ఉంటే ఢీకొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

### ఫాగ్ లైట్లు ఉపయోగించాలి

పొగమంచు సమయంలో హై బీమ్ లైట్లను ఉపయోగించరాదు. ఎందుకంటే అవి పొగమంచులో ప్రకాశాన్ని పెంచుతాయి. దీని కారణంగా రహదారి అస్పష్టంగా కనిపిస్తుంది. లోబీమ్ ఉండే ఫాగ్ లైట్లను ఉపయోగించాలి. ఎందుకంటే అవి పొగమంచులో చొచ్చుకుపోవడానికి, రహదారిపై ముందుకు వెళ్లడానికి సహాయపడతాయి.

### అకస్మాత్తుగా బ్రేక్ వేయొద్దు

పొగమంచులో సడన్ బ్రేక్‌లు వేయడం వల్ల కారు స్కిడ్ అయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది. అందువల్ల నెమ్మదిగా డ్రైవ్ చేయాలి. ఇండికేటర్‌లను సరిగ్గా ఉపయోగించాలి. తద్వారా వెనుక వచ్చే వాహనాల డ్రైవర్లు కారు ఎటువైపు తిరుగుతుందో అర్థం చేసుకోగలరు.

### డీఫాగర్‌ను ఉపయోగించండి

పొగమంచు వల్ల మీ వాహనం విండ్‌షీల్డ్‌పై నీరు పేరుకుపోతుంది. ఇది ముందువైపు వ్యూను మరింత తగ్గిస్తుంది. కాబట్టి డీఫాగర్‌ను ఆన్ చేయాలి. ఇది కాకుండా మీరు విండ్‌షీల్డ్ వైపర్‌లను కూడా ఉపయోగించవచ్చు. సురక్షితమైన డ్రైవింగ్ కోసం విండ్‌షీల్డ్‌ను శుభ్రంగా ఉంచడం చాలా ముఖ్యం.

### హజార్డ్ లైట్లను ఉపయోగించాలి

అన్ని వాహనాలకు పార్కింగ్ లైట్ల కోసం ప్రత్యేక బటన్ ఉంటుంది. ఆ బటన్‌ను నొక్కడం ద్వారా వాహనం నాలుగు వైపులా సూచికలు ఏకకాలంలో వెలిగించడం మంచిది. వీటిని హజార్డు లైట్లు అని కూడా అంటారు. ఈ లైట్లను ఉపయోగించడం ద్వారా దూరం నుంచి, వెనుక, ముందు వచ్చే వాహనాలను చూడవచ్చు.

#### జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు తప్పవు



చలి కాలంలో వాహనాలు, డ్రైవర్లకు పొగమంచు ప్రధాన శత్రువు. మంచు కారణంగా రోడ్డు స్పష్టంగా కనిపించదు. సాధారణంగా నడిపినట్లు మంచు వాతావరణంలో కూడా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయి. అనుభవజ్ఞులు, సుశిక్షితులైన డ్రైవర్లకు ప్రతికూల వాతావరణంలో వాహనాలు నడిపిన అనుభవం ఉంటుంది కాబట్టి వారు జాగ్రత్త పడగలరు. స్వంతంగా వాహనాలు నడిపేవారు, కొత్తగా వాహనాలు తీసుకున్న వారు, ఉదయం పూట ప్రయాణాలు పెట్టుకున్న వారు కచ్చితంగా జాగ్రత్తలు తెలుసుకోవాల్సిందే. ప్రయాణాలకు ముందురోజు తాము ప్రయాణం చేయాల్సిన మార్గం, అందులోని వాతావరణం, ఆ వాతావరణంలో పాటించాల్సిన జాగ్రత్తలను విధిగా తెలుసుకుంటే సురక్షితంగా గమ్యం చేరవచ్చు.

-విజయ కుమారి, ఎంవీఐ, పీలేరు

## రాజీ మార్గమే రాజమార్గం

● లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

● జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి

కడప రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు తమ సమస్యలను లోక్ ఆదాలత్‌లో రాజీమార్గంతో పరిష్కరించుకుని తద్వారా సత్వర న్యాయం పొందడంతో పాటు డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలన్నారు. ఇక్కడ ఒకసారి కేసు పరిష్కారం అయితే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అపీల్‌కు వెళ్లడానికి వీలు పడదన్నారు. లోక్ అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. దీర్ఘకాలిక కేసులకు కూడా లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా చక్కటి పరిష్కారం దొరుకుతుందన్నారు. ఇప్పటికే కోర్టులలో దాఖలై విచారణకు వేచి ఉన్నవే కాక కోర్టులో దాఖలు కాని సమస్యలను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కోర్టుల జడ్జిలు, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గురప్పనాయుడు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

**లోక్ అదాలత్‌లో 6,553 కేసులకు అవార్డులు**

ఉమ్మడి జిల్లాలోని వివిధ కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 6,553 కేసులకు అవార్డులు ఇచ్చినట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి తెలిపారు. ఇందుకు రూ.6,72,21,635 చెల్లింపులు జరిగాయన్నారు. కడపలో 5, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 2, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టుల్లో ఒక్కొక్క బెంచ్ చొప్పున ఏర్పాటు చేసి లోక్ అదాలత్‌కు వచ్చిన కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించామన్నారు. ఈ మేరకు జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో అవార్డు పొందిన యాక్సిడెంట్ కేసుకు సంబంధించి బాధితుని తరుపు వారికి రూ.83 లక్షల చెక్కును అందజేశామన్నారు.

## రూ.60 వేల నగదు చోరీ



పైకప్పు రేకులు కోసిన దృశ్యం

చాపాడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని నక్కలదిన్నె రోడ్డులో మహేశ్వర్‌రెడ్డికి చెందిన దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి రూ.60 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్ చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి ఆన్‌లైన్ సెంటర్ నిర్వహిస్తూ ఎస్‌బీఐ ఏజెంట్‌గా ఉండేవాడు. ప్రజలతో లావాదేవీలు జరుపుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కొంత నగదు, సెల్‌ఫోన్ షాపులోనే ఉంచి ఇంటికి వెళ్లాడు. కాగా అదేరోజు అర్ధరాత్రి కొంతమంది వ్యక్తులు దుకాణం పైకప్పు రేకులను మిషన్‌తో కోసి దుకాణంలోకి దిగి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. మూడు అడుగుల వెడల్పు, మూడు అడుగుల పొడవుతో రేకులను కోసి రంధ్రం వేశారన్నారు. దుకాణదారుడు లక్ష్మీపేట గ్రామానికి చెందినవాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## అమ్మమ్మ మృతితో..

● హత్యకు గురై రెండేళ్ల కిందట తల్లి..

● అనారోగ్యంతో తండ్రి తనువు చాలించారు ● కొండపేటలో విషాదగాథ

# అనాథలుగా చిన్నారులు

చెన్నూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అభం.. శుభం.. తెలియని ఆ చిన్నారులను చూస్తే మానవత్వం వున్న వారెవరైనా కంటతడి పెట్టాల్సిందే. పట్టుమని పదేళ్లు కూడా లేని ఆ బిడ్డలు కన్నవారి ప్రేమకు దూరమయ్యారు. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో వారిని అమ్మమ్మ అక్కున చేర్చుకుంది. అప్పటి నుంచి ఆలనా పాలన చూసుకొనేది. కానీ విధి ఆడిన ఆటలో ఆ చిన్నారులు ఓడిపోయారు. అనారోగ్యంతో అమ్మమ్మ కూడా శనివారం తనువు చాలించడంతో ఆ బిడ్డలు అనాథలుగా మిగిలిపోయారు. ఇది చూసిన వారంతా అయ్యో.. పాపం.. ఎంత పని చేశావు దేవుడా.. అంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. వివరాల్లోకెళ్తే..



మృతదేహం వద్ద అమాయకంగా ఉన్న చిన్నారులు

అనంతపురం జిల్లా వడియంపేట గ్రామానికి చెందిన కె.రంగనాయకులు, ఆయన భార్య జ్యోతి, అతని అత్త రాజమ్మ కొండపేటలో ఓ ఇంటిని బాడుగకు తీసుకుని కూలి పనులు చేసుకుని జీవించే వారు. వీరికి రాజేశ్ (10), శ్రీకర్ (8)లు ఉన్నారు. ఇది లావుండగా రెండు సంవత్సరాల క్రితం ఆ చిన్నారుల తల్లి జ్యోతి హత్యకు గురి కాగా, 10 రోజుల కిందట తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి వారి ఆలనా పాలన అమ్మమ్మే చూసుకొనేది. కానీ తండ్రి పెద్దకర్మ జరిగిన మరుసటి దినమే కంటికి రెప్పలా చూసుకొనే అమ్మమ్మ సైతం అనారోగ్యంతో శనివారం అశువులు బాసింది. ఈమెకు గతంలో గెండెకు సంబంధించిన సమస్య వుండేది. ఇటీవల ఆపరేషన్ కోసం పుట్టపర్తి వెళ్లగా అక్కడ చికిత్స చేయించుకుంటూ చనిపోయింది. ఆమె శవాన్ని కొండపేటకు తీసుకువచ్చారు. దీంతో ఆ చిన్నారుల పరిస్థితి ఓ విషాద గాథగా మిగిలింది. కాగా ఈ కష్టం ఏ కుటుంబానికి రాకూడదని, ప్రభుత్వం వారికి ఏదో ఒక దారి చూపించి ఆదుకోవాలని గ్రామ స్తులు కోరుతున్నారు. వీరితో పాటుగా గ్రామ మాజీ సర్పంచ్ మన్నె మోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఆ కుటుంబానికి ప్రభుత్వ సహకారం అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కాగా చిన్నారుల భవితకు దాతలెవరైనా సహకరించి ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## తీర్థయాత్రకు వెళ్లిన మహిళ గుండెపోటుతో మృతి



ఉషారాణి (ఫైల్)

సిద్దవటం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల్లో భాగంగా గుజరాత్ రాష్ట్రానికి వెళ్లిన సిద్దవటం గ్రామానికి వెళ్లిన మహిళ గుండెపోటుతో గురువారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... స్థానికంగా నివసించే సూర్యనారాయణ, తన భార్య ఉషారాణి (60)తో కలిసి డిసెంబరు 5న తీర్థయాత్రలకు వెళ్లారు. 12వ తేదీ గురువారం ఉదయం గుజరాత్‌లోని సోమనాథ్‌లో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం సుమారు 8.30 గంటల సమయంలో గుండెపోటు రావడంతో ఉషారాణి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో సమీపంలోని ఆస్పత్రికి ఆమెను తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శుక్రవారం రాత్రి ఆమె మృతదేహాన్ని సిద్దవటంలోని వారి ఇంటికి తీసుకురాగా, శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. ఈమె 20 ఏళ్లుగా సాయిగణేష్ డ్వాక్రా సంఘం లీడర్‌గా మంచి గుర్తింపు పొందారు

## రేపు జిల్లా కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ ఎంపిక కార్యక్రమం ఈ నెల 16న సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక డీఎస్‌ఏ క్రీడా ప్రాంగణంలో జరుగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి సి.కొండయ్య తెలిపారు. ఇందులో పాల్గొనే ఔత్సాహిక క్రీడాకారుల వయస్సు 2005 జనవరి 12 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. కాగా బాలుర బరువు 70 కేజీలు, బాలికల బరువు 65 కేజీల లోపు వుండాలన్నారు. హాజరయ్యే వారు తప్పక వారి ఒరిజినల్ ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈస్ట్ గోదావరి జిల్లా రావులపాలెంలో ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో జరగనున్న అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి వుంటుందన్నారు. వివరాలకు 9866719473ను సంప్రదించాలని కోరారు.

# అట్టహాసంగా కాశిరెడ్డినాయన ఉత్సవాలు ప్రారంభం

● దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

● పటిష్టమైన బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు

● భక్తుల కోసం సువిశాలమైన చలువ పందిర్లు

● విస్తృతంగా అన్నదానం



అన్నదానం కోసం వినియోగిస్తున్న కూరగాయలు

కాశినాయన, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోతిక్షేత్రంలో శనివారం అవధూత కాశినాయన 29వ ఆరాధనోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున రుద్రాభిషేకం, గణపతి పూజలతో కాశిరెడ్డినాయన రెండురోజుల ఆరాధనోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ ప్రధానార్చకులు జీరయ్యస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితీష్‌రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆరాధనను పురష్కరించుకొని జ్యోతి క్షేత్రం కాశినాయన నామస్మరణతో మార్మోగిపోయింది. కాశినాయన గర్భగుడిలోని పాలరాతి సమాధితో పాటు పరిసరాల్లోని దత్తాత్రేయ, లక్ష్మీనరసింహస్వామి, అన్నపూర్ణాదేవి, రామాలయం తదితర ఆలయాలను రకరకాల పూలతో, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలోని కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, అనంతపురం, చిత్తూరు తదితర జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు జ్యోతి క్షేత్రానికి స్వచ్ఛందంగా తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్షేత్రం జనసంద్రంగా మారింది. ఆరాధనకు వచ్చిన భక్తులు కాశినాయన సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం లక్ష్మీ నరసింహస్వామి, అన్నపూర్ణేశ్వరి, దత్తాత్రేయ, ఆవు సమాధిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ఆరాధనకు వచ్చిన భక్తులతో అన్నదాన కౌంటర్లు కిక్కిరిసిపోయాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చలువ పందిళ్లు, నీటివసతి కల్పించారు. స్థానికులతో పాటు యర్రగుంట్ల, అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్, తాడిపత్రి, తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు వందల సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అనేక కార్యక్రమాల్లో విరివిగా సేవలందిస్తున్నారు. కాశినాయన ఆరాధనకు వచ్చిన భక్తులు తమతో పాటు అన్నదానానికి తమకు తోచిన మేర ఆర్థిక సాయంతో పాటు బియ్యం, బేడలు, కూరగాయలు, ప్లేట్లు ఇతర వస్తువులు కానుకలుగా అందిస్తున్నారు. రాత్రి జ్యోతి ప్రజ్వలన, రథోత్సవం నిర్వహించారు. డా.ప్రశాంతి ఆధ్వర్యంలో నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలు అందజేశారు. మైదుకూరు డీఎస్పీ అధ్యక్షతన పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్‌ఐ హనుమంతు పర్యవేక్షణలో దాదాపు 175 మంది పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులతో పాటు వందల సంఖ్యలో ప్రైవేట్ వాహనాల్లో భక్తులు రావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృతంగా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ భక్తులకు సేవలందించారు.



ప్రత్యేకంగా అలంకరించిన కాశినాయన పాలరాతి సమాధి



# ప్రతి బిడ్డకు తల్లి ప్రథమ గురువు

● ప్రభుత్వ విప్ మాధవి, వైస్ చాన్స్‌లర్ కృష్ణారెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి బిడ్డకు తమ తల్లులే ప్రథమ గురువులని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, వైవీయూ వైస్ చాన్సలర్ కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చన్నారు. శనివారం కడప నగరం ఎస్‌కేఆర్‌అండ్‌ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలలో పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల కంటే గురువు పాత్ర చాలా ప్రధానమైందని, గురువు ఆశీస్సులతో, గురువు అందించిన విజ్ఞానంతో విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకుంటారని, అందుకు ప్రత్యక్ష నిదర్శనం తానేనని చెప్పారు. మహిళలకు తగిన విశ్రాంతి, రక్షణ అవసరమని మహిళలకు, మహిళాభివృద్ధికి భవిష్యత్తులో మరిన్ని ప్రోత్సాహకాలు, అవకాశాలు అవసరమని ఒక మహిళ, ఎమ్మెల్యేగా మహిళల అభ్యున్నతికి, రక్షణ కోసం తనవంతు కృషిచేస్తానని తెలియజేశారు. ఉపకులపతి ప్రొఫెసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలు సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వ్యక్తులని కుటుంబంలో గాని, కార్యాలయంలో గాని మహిళల పాత్ర చాలా ప్రధానమైనదన్నారు. ప్రతి బిడ్డకు తన తల్లే ప్రథమ ఉపాధ్యాయురాలన్నారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులు, కళాశాలలో పనిచేసిన అధ్యాపకులు, ప్రధాన ఆచార్యులు హాజరయ్యారు. విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఓ.విజయలక్ష్మి, విశ్రాంత రీజనల్ జాయింట్ డైరెక్టర్ మల్లీశ్వరి, పూర్వ ప్రధానాచార్యులు సంజీవమ్మ, ప్రేమలత, రాజమ్మ, రంగారెడ్డి, డాక్టర్ బీఆర్ శైలజ, చరిత్ర అధ్యాపకులు రజియ సుల్తాన, అర్థశాస్త్ర అధ్యాపకులు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, శివపార్వతి, మాజీ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి హాజరయ్యారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

స్వర్ణోత్సవాలకు సంబంధించి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను రంజింపజేశాయి. హాజరైన ప్రముఖులను కళాశాల ప్రిన్సిపల్, ఆలుమ్ని అసోసియేషన్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

# మూగజీవాల నిర్బంధం !

● ఆకలి దప్పికతో మూగవేదన

● న్యాయం కోసం బాధితుల మొర

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య నెలకొన్న పంతాలు, పట్టింపుల ముందు మూగజీవాల ఆవేదన ఓడిపోయింది. మమతలు మరచి స్వార్థాలు తెచ్చిన తంటా నోరు లేని జీవాలకు మూగ వేదన మిగిల్చింది. ప్రాణం విలువ మరచిన ఓ మనిషి... మాపై దయచూపవా అంటూ కాలే కడుపుతో కన్నీటి రోధన మానవ హృదయాలను కదిలించలేకపోయింది. మూడు రోజులపాటు తాగేందుకు నీరు లేక, తినేందుకు ఆహారం లేక బయటకు కదలలేక తమ బాధ మానవత్వాన్ని గుర్తు చేయించలేక దయనీయ స్థితిలో రాత్రింబవళ్లు ఆ మూగజీవాలు గడిపాయి. మూగజీవాలకు వచ్చిన కష్టం తీర్చమని యజమానురాలు పోలీసులను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించి తమ గోడును విన్నవించుకున్నారు. తమకు వచ్చిన కష్టం తీర్చమని అధికారుల చుట్టూ తిరిగి మూగజీవాల కడుపు నింపే మార్గం కోసం తపనపడ్డారు. ఇదేదో పట్నం సొగసుల మధ్య జరిగిన ఘటన కాదు మూగజీవాల పుట్టినిల్లు అయిన పల్లెసీమల్లో చోటుచేసుకున్న దయనీయ గాథ.



నిర్బంధంలో ఉన్న పశువులు

ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లెకు చెందిన మేకల చెన్నమ్మ, శ్రీనివాసులు భార్య మేకల లక్ష్మీదేవి వివరాల మేరకు.. చెన్నమ్మ భర్త గంగయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అనారోగ్యంతో మూడేళ్ల కిందట మృతి చెందారు. అప్పటి నుంచి చెన్నమ్మ వరుసకు కుమారుడు అయ్యే శ్రీనివాసుల వద్ద ఉంటూ తన బాగోగులు చూసుకునేలా ఏర్పాటు చేసుకుంది. వీరికి మూడు ఎనుములు, రెండు ఆవులు, మూడు దూడలు ఉన్నాయి. చెన్నమ్మ, శ్రీనివాసులుకు అతని సోదరులు వెంకటసుబ్బయ్య, నాగార్జుల మధ్య ఆస్తి బాగపరిష్కార విషయంలోనూ, రస్తా వివాదంలోనూ మనస్పర్థలు ఉన్నాయి. దీంతో వారు శ్రీనివాసులుకు చెందిన పశువులు ఉంచే ఇంటి ముందు ఈ నెల 11వ తేదీన బండలు నాటారు. ఈ నేపథ్యంలో ఆరోజు జరిగిన ఘర్షణలో శ్రీనివాసులు తీవ్ర గాయాలపాలై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బండలు నాటడంతో జీవాలు బయటకు రాలేక వాటికి నీరు, ఆహారం అందించేందుకు వీలు లేకుండా పోయిందని బాధితులు తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దారు గంగయ్యను కలిసి వినతిపత్రం అందించి న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. దీంతో రూరల్ ఎస్‌ఐ రఫి శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకుని వెళ్లారని పేర్కొన్నారు. అయినా తమ సమస్యకు పరిష్కారం లభించలేదని చెన్నమ్మ, శ్రీనివాసులు భార్య లక్ష్మీదేవి వాపోయారు. చివరికి చేసేది లేక పశువులు ఉంచిన ఇంటి గోడ బండలను తొలగించి ఒక రంధ్రాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా పశువులకు నీరు, గడ్డి, ఆహారం అందిస్తున్నట్లు వివరించారు.



పశువుల రాకపోకలకు అడ్డంగా నాటిన బండలు

## వివేకా పీఏ ప్రైవేట్ కేసుపై పోలీసుల విచారణ

పులివెందుల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్యకేసులో ఆయన పీఏ కృష్ణారెడ్డి వేసిన ప్రైవేటు కేసుపై పోలీసులు జనార్ధన్‌రెడ్డి, బైపురెడ్డి, లాయర్ ఓబుల్‌రెడ్డిని శనివారం డీఎస్పీ కార్యాలయంలో విచారించారు. అప్పటి సీబీఐ అధికారి రామ్ సింగ్ బెదిరిస్తున్నారని పులివెందుల కోర్టులో కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. కోర్టు కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించడంతో గత ఏడాది డిసెంబరు 15నవివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ ఎస్పీ రాంసింగ్‌పై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ గత ప్రభుత్వంలో పోలీసులు ఈ కేసుపై సరైన విచారణ లేకుండా చార్జిషీట్ దాఖలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుపై పూర్తి విచారణ చేయాలని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఆదేశించడంతో మళ్లీ దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం ముగ్గురిని విచారించారు.

## ఇంధన పొదుపు ప్రతిఒక్కరి బాధ్యత

కడప కలెక్టరేట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం నుంచి 20వతేదీ వరకు నిర్వహించే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇంధన సామర్థ్యం, పరిరక్షణ ప్రాముఖ్యత, విద్యుత్ ఆదా గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రసంగాలు, ర్యాలీలు, విద్యార్థుల్లో అవగాహనకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు, వర్క్‌షాపులు, సెమినార్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ, డీఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలు

● ఎలక్ట్రిక్ సైకిల్‌లో వెళ్తున్న వారిని ఢీకొన్నకారు

ప్రొద్దుటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ సైకిల్‌లో వెళుతున్న ముగ్గురు చిన్నారులను కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలై ఆసుపత్రిపాలైన ఘటన ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. స్థానిక గోపవరం పంచాయతీ హౌసింగ్ బోర్డు కాలనీలో ఎలక్ట్రిక్ సైకిల్‌పై ముగ్గురు మైనర్లు రోడ్డు మీదకు వచ్చారు. రూరల్ పోలీసుస్టేషన్ సమీపంలోకి రాగానే గిద్దలూరు నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న కారు వారిని ఢీకొంది. దీంతో కారు పక్కనే వున్న కాలువలో పడిపోయింది. కారులో వున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే చిన్నారులకు తీవ్రగాయాలవడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనారోగ్యంతో రెవెన్యూ ఉద్యోగి మృతి

వాల్మీకిపురం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కెవిన్(29) గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఉద్యోగి కెవిన్ స్వగ్రామం ఆరోగ్యవ రం. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ శనివారం ఆరోగ్యవరం చేరుకుని కెవిన్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అతి చిన్న వయస్సులో కెవిన్ మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. కెవిన్ మృతి పట్ల తహసీల్దార్ పామిలేటి, రెవెన్యూ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## నేడు కాశినాయన ఆరాధన

లింగాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వనంబావి శివాలయంలో వెలసిన కాశినాయన ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి బండలాగుడు పోటీలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉం టాయని తెలిపారు.

## జైలు అధికారుల వాగ్వాదం?

కడప(క్రైం), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలు అధికారులు మధ్య శనివారం వాగ్వాదం చోటుచేసుకుంది. జైలుకు సంబంధించి పెట్రోల్ బంకు డ్యూటీల విషయమై అధికారులు, సిబ్బంది మధ్య మాటమాట పెరిగి వాగ్వాదానికి దిగారు. పెట్రోల్ బంకులో వచ్చే లావాదేవిలలో వాటాల కోసమే ఈ వాగ్వాదం జరిగినట్లు సమాచారం. జైలు పర్యవేక్షణ అధికారి రాజేశ్వర్‌రావును వివరణ కోరగా తమ అధికారులు, సిబ్బంది మధ్య ఎలాంటి గొడవలు జరగలేదన్నారు.









# చివరి ఆయకట్టు వరకూ నీరందేలా కృషిచేయాలి

**● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి**



నీటి సంఘం అధ్యక్షులతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యులుగా ఎన్నికైన వారంతా బాధ్యతగా పనిచేయాలని, చివరి ఆయకట్టు వరకూ నీరందేలా కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సూచించారు. శనివారం చెన్నూరు, చిన్నమాచుపల్లి, అలంఖాన్‌పల్లె నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన వారంతా రాష్ట్ర ఉపాధ్యక్షుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీ కెనాల్ చివరి ఆయకట్టు వరకూ ప్రతీ ఎకరాకు నీరు అందేలా కృషి చేయాలన్నారు. అలాంటప్పుడే పదవికి సార్థకత ఉంటుందన్నారు. మండల కన్వీనర్ కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఐ.శివారెడ్డి ఆధ్వర్యంలో నీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడం అభినందనీయమన్నారు. చెన్నూరుకు అధ్యక్షుడిగా గోదిన శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా ముండ్ల హరింద్రారెడ్డి, చిన్నమాచుపల్లెకు ఆవుల శంకర్‌రెడ్డి, మునిసుబ్బారెడ్డి, ఆలంఖాన్‌పల్లెకు అధ్యక్షుడిగా తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి, (బుజ్జన్న), ఉపాధ్యక్షుడిగా నాగం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికయ్యారు.

**వల్లూరు:** మొత్తం ఏడు స్థానాలలోనూ తెలుగుదేశం అభ్యర్థులే పోటీలో నిలబడి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబవరం నీటి సంఘం అధ్యక్షుడిగా ఎస్.శివారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పుత్తా చంద్రశేఖర్ రెడ్డి, గోటూరు అధ్యక్షురాలిగా చల్లా సుబ్బమ్మ, ఉపాధ్యక్షుడిగా ఎస్. వెంకటసుబ్బారెడ్డి, తప్పెట్ల అధ్యక్షుడిగా ఎం.సదాశివారెడ్డి, ఉపాధ్యక్షుడిగా బి.గోళ్ల నాగన్న, కొప్పోలు అధ్యక్షుడిగా ఎం.లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షుడిగా టి.విజయేంద్రారెడ్డి, పెద్దపుత్త అధ్యక్షుడిగా వెంకటశివారెడ్డి, ఉపాధ్యక్షుడిగా టి.ప్రసాద్‌రెడ్డి, పైడికాల్వ అధ్యక్షుడిగా ఆకుల వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడిగా గండి రవి, తోళ్లగంగనపల్లె అధ్యక్షుడిగా చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా వేల్పుల దేవమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారంతా ఏకగ్రీవం అయ్యేందుకు టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కొప్పోలు ఓబుల్‌రెడ్డి కృషి చేశారు.

**వేముల:** మండలంలో మూడు మైనర్ చెరువులకు, పీబీసీ కాల్వకు సంబంధించి మూడు మేజర్ డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు జరగ్గా అన్నింటికీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధి రెడ్డి, ఆయన సోదరుడు శేషారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఏకగ్రీవమయ్యాయి. మైనర్ చెరువులైన బచ్చయ్యగారిపల్లె నాయునిచెరువు ఛైర్మన్‌గా కూనపూరి రాములు, వైస్ ఛైర్మన్‌గా వెన్నపూస నాగేశ్వరమ్మ, వేల్పుల చెరువుకు రాగిపిండి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఛైర్మన్ లక్కిరెడ్డి అమర్‌నాథరెడ్డి, పెండ్లూరు చెరువుకు పేరం సాంబశివారెడ్డి, వైస్ ఛైర్మన్‌గా ఆసం ఎల్లారెడ్డి, పీబీసీ కాల్వకు సంబంధించి కొత్తపల్లె డిస్ట్రిబ్యూటరీకి ఛైర్మన్‌గా రాజశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ నాగెళ్ల ఆంజనేయరెడ్డి, గొల్లలగూడూరు డిస్ట్రిబ్యూటరీకి ఛైర్మన్‌గా అన్నారెడ్డి మల్లికార్జునరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా యర్రంరెడ్డి రామచంద్రారెడ్డి, నల్లచెరువుపల్లె డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ అన్నారెడ్డి వెంకటలక్ష్మీరెడ్డి, వైస్ ఛైర్మన్‌గా కాకర్ల మనోహర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**వేంపల్లె :** వేంపల్లె మండలంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పీబీసీ కాల్వకు సంబంధించి అంబవరం పద్మావతి, బండి వీరాంజనేయస్వామి, ఊటకాల్వకు సంబంధించి షేక్ రమీజబీబీ, కుమ్మరాంపల్లె గుండ్లమడుగు ఊటకాల్వకు యలంకూరు రమణయ్య, టి.వెమలవారిపల్లె చెరువుకు బండి బాలగుర్రప్ప, గిడ్డంగివారిపల్లె చెరువు సంఘానికి మల్లంగి చంద్రసేనలు ఏకగ్రీవమయ్యారు. అలాగే అలిరెడ్డిపల్లె ఎద్దలకొండ కాల్వ సంఘం ఎన్నికల్లో బలిజ సంఘం తరఫున ఉమ్మడి పార్టీల అభ్యర్థిగా బాలసుబ్రమణ్యంను ఎన్నుకున్నారు.

**చక్రాయపేట:** చక్రాయపేట మండలంలోని ఏడు సాగునీటి సంఘాల చెరువులకు ఎన్నికలు జరగ్గా ఏడూ ఏకగ్రీవం అయినట్లు అధికారులు తెలిపారు. కాలేటివాగు ఛైర్మన్‌గా లోమడ రామిరెడ్డి, గొందిచెరువు ఛైర్మన్‌గా ప్రభాకర్‌రెడ్డి, చక్రాయిచెరువు ఛైర్మన్‌గా ప్రసాదరెడ్డి, దేశిరెడ్డిచెరువు ఛైర్మన్‌గా బాలే రామకృష్ణారెడ్డి, రేకులకుంట చెరువు ఛైర్మన్‌గా కర్నాటి గంగిరెడ్డి, ఉప్పలవాండ్లకుంట ఛైర్మన్‌గా బి.రమణారెడ్డి, గండికవ్వూరు చెరువుకు పి.యశోదమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి.

**లింగాల :** మండలంలోని దొండ్లవాగు సాగునీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. వైసీపీ నుంచి పోటీదారులు లేకపోవడంతో 12టీసీలకు గాను 10టీసీలు టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 9,12 టటీసీలకు నామినేషన్ నమోదు కాలేదు. దొండ్లవాగు సాగునీటి సంఘం సంఘం అధ్యక్షుడిగా దేవిరెడ్డి గురివిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చవ్వా కరుణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు.

**సింహాద్రిపురం:** బలపనూరు, తొండూరు డిస్ట్రిబ్యూటరీల కింద జరిగిన ఆరు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. సింహాద్రిపురం సాగునీటి సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వెన్నపూస సుదర్శన్‌రెడ్డి, వెన్నపూస పవన్ కుమార్‌రెడ్డి, కసనూరుకు మారెడ్డి జోగిరెడ్డి, కాటసాని ప్రతాప్‌రెడ్డి, హిమకుంట్లకు వై.సూర్యశేఖర్ రెడ్డి, వి.పద్మనాభరెడ్డి, అంకాళమ్మగూడూరుకు వై.అమర్‌నాథరెడ్డి, కె.ఆనందరెడ్డి, బలపనూరుకు కె.వీరప్రతాపరెడ్డి, రాజేశ్వరి, తొండూరుకు బి.మహేశ్వర్‌రెడ్డి, పి.రామాంజులరెడ్డి ఎన్నియ్యారు.

**కమలాపురం నియోజకవర్గంలో...**

నియోజకవర్గం పరిధిలో గల 28 నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.ఆయా సంఘాల్లో పీసీ మెంబర్లు ఏకగ్రీవమయ్యారు. కమలాపురం మండల పరిధిలో నాలుగు సంఘాలు, వల్లూరు ఏడు, సీకెదిన్నె 10, చెన్నూరు మూడు, పెండ్లిమర్రి మండల పరిధిలో నాలుగు సంఘాలు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు.

**పుట్లంపల్లె చెరువు నీటి సంఘ ఏకగ్రీవం**

కడప ఎర్రముక్కపల్లె : పుట్లంపల్లె చెరువు నీటి సంఘం ఏకగ్రీవం అయింది. ఛైర్మన్‌గా వినోద్‌కుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా కె.రాజారెడ్డి ఎన్నికయ్యారు.

**చింతకొమ్మదిన్నె:** చింతకొమ్మదిన్నెలో సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. చెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా గజ్జెల చెన్నక్రిష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోవిందు వెంకటరమణ, కొలుములపల్లె అన్నంరాజుహరి, ఎస్.హుస్సేనయ్య, కాం పల్లెకు పాలగిరి అమీర్‌బాష, నారే రామచంద్రనాయుడు, బానుపల్లికి విశ్వనాథరెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, కొప్పర్తికి చెమ్మిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, అంబవరం రాజారెడ్డి, బుగ్గవంక నీటి కాలువకు ఇప్పెంట-1 టి.వెంకటేశ్వరరెడ్డి, ఉత్తయ్య, ఇప్పెంట-2కు వీరభద్రయ్య, తాహీర్‌పీర్, మామిళ్లపల్లెకు రామయ్య, గంగిరెడ్డి, కొలుములపల్లెకు రామమోహన్‌రెడ్డి, చెన్నంశెట్టి శంకరయ్య, చింతకొమ్మదిన్నె కంది వెంకటరమణారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇరిగేషన్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.

**పెండ్లిమర్రి:** మండల పరిధిలోని నాలుగు నీటి సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. నందిమండలం నీటి సంఘానికి ఛైర్మన్‌గా కొండ మయూర్‌కుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా పంగా రా మ్మూర్తి, పెద్దదాసరిపల్లెకు ఛైర్మన్‌గా ఎరుకలరెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్‌గా లక్ష్మీదేవి, గంగనపల్లెకు చిన్నసిద్దయ్య, వైస్ ఛైర్మన్‌గా వెంకటసుబ్బయ్య, మాచునూరుకు ఛైర్మన్‌గా గజ్జల రాజగోపాల్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు.

## నేడు 'చీర్‌ఫుల్ కడప' కార్యక్రమం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజీవ్‌పార్క్ ఎదుట ఆదివారం సాయంత్రం 6 గంటలకు కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చీర్‌ఫుల్ కడప కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప నగర అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజలందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కమిషనర్ కోరారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్‌ఇంజనీర్ శివగణేష్ తెలిపారు. 33కేవీ ఎస్టేట్ ఫీడర్ మరమ్మతుల వల్ల పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 వరకు విద్యుత్ ఉండదన్నారు.

## పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం



డాక్టర్ ఎం.డి ఉబేదుల్లా
అర్బన్ హెల్త్ సెంటర్ల నోడల్ అధికారి

ఫటాఫట్

కడపకలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందిండమే లక్ష్యమని అక్కాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు, అర్బన్ హెల్త్ సెంటర్ల నోడల్ అధికారి డాక్టర్ ఎం.డి ఉబేదుల్లా అన్నారు. సీజనల్‌వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆర్‌ఎంపీ వైద్యులను సంప్రదిస్తే జరిగే అనర్థాలపై ఫటాఫట్ ఇంటర్వ్యూలో వివరించారు.

**ప్రశ్న:** కడప నగరంలో ఎన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి?

**జవాబు:** నగర పరిధిలో 13 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇక్కడ పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందించేలా నోడల్ అధికారిగా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. పేదలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించేలా సిబ్బంది సేవలందిస్తున్నారు.

**ప్రశ్న:** డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది సకాలంలో వైద శాలలకు వస్తున్నారా?

**జవాబు:** దాదాపు 101 మంది ఏఎన్ఎంలు, క్లస్టర్ వారీగా ముగ్గురు చొప్పున సూపర్‌వైజర్లు ఉన్నారు. వీరంతా నిర్ణీత గడువులో పేవిధులకు హాజరవుతున్నారు. రోజువారీగా వారు అందించే వైద్య సేవలను తెలపాల్సి ఉంటుంది.

**ప్రశ్న:** అక్కాయపల్లి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రసవాలు జరుగుతున్నాయా?

**జవాబు:** గర్భిణులు ఆందోళన పడాల్సిన పని లేదు. అనుభవం, మంచి నైపుణ్యం గల ఏఎఎన్ఎంలు ఉన్నారు. ఇటీవల నలుగురు మహిళలకు ప్రసవాలు చేశాం. తల్లీబిడ్డలు, ఆరోగ్యంగా ఉన్నారు. వారి ఆరోగ్యం పట్ల ప్రతిరోజు ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తున్నారు. అలాగే అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రసవాలు చేసేందుకు అనుమతి లేదు. అక్కడికి వైద్యం కోసం వచ్చిన గర్భిణులకు వారి ఆరోగ్య స్థితిని బట్టి పీహెచ్‌సీలకు, అవసరమైతే రిమ్స్ కు రెఫర్ చేస్తున్నాం.

**ప్రశ్న:** పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకే మొగ్గు చూపుతారెందుకు?

**జవాబు:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్య పరికరాలు ఉన్నా వైద్యులు, సిబ్బంది సరిగా పనిచేయరనే అపోహ గతంలో ఉండేది. ఏ చిన్న వ్యాధి వచ్చినా ఆర్‌ఎంపీలు, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే వారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసు పత్రుల్లో అన్ని రకాల ఆధునిక వైద్య పరికరాలు ఉన్నాయి. వైద్య సిబ్బంది కూడా 24 గంటలూ అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలతో మమేకమవున్నారు.

**ప్రశ్న:** సీజనల్ వ్యాధుల అదుపునకు చర్యలు తీసుకుంటున్నారా?

**జవాబు:** వర్షాకాలం, చలికాలంలో దోమల కారణంగా ఎక్కువగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వస్తుంటాయి. ఈ సీజన్లలో ప్రజలు దోమకాటుకు గురికాకుండా ఉండేలా ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

**ప్రశ్న:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎన్నిరకాల పరీక్షలు చేస్తున్నారు?

**జవాబు:** పీహెచ్‌సీల్లో దాదాపు 60 రకాల వ్యాధులకు సంబంధించి రక్త పరీక్షలు చేస్తున్నాం. సుమారు 172 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

**ప్రశ్న:** క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు జరుగుతున్నాయా?

**జవాబు:** క్యాన్సర్ బాధితుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు స్ర్కీనింగ్ పరీక్షలు చేస్తున్నాం.

# ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**● ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి**



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పింఛనర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు ఇచ్చిన హామీలు ఆరునెలలైనా అమలుకు నోచుకోలేదన్నారు. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇస్తామని, మధ్యంతర భృతిని చెల్లిస్తామని, పెండింగ్ బకాయిలన్నిటినీ చెల్లిస్తామని, డీఏలను సకాలంలో ప్రకటిస్తామని మాటీ ఇచ్చారన్నారు. టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి ఉప విద్యాశాఖాధికారుల, డైట్ లెక్చరర్ల ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హతలు కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్ రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, వీవీ రమణారెడ్డి, సి.కె.శ్రీనివాసరెడ్డి, రామచంద్రారెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి, అన్వర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# మేం కాదు.. మీరే పోటీ చేయలేని దద్దమ్మలు

**● టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి**



మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 'మేం కాదు.. మీరే పోటీ చేయలేని దద్దమ్మలు' అని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి ధ్వజమెత్తారు. నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎంపీ అవినాష్‌రెడ్డి 'ఎన్నికల్లో గెలవలేని దద్దమ్మలు' అంటూ మాట్లాడారన్నారు. అందుకు మేం కాదు దద్దమ్మలు.. పన్ను కట్టడానికి కానీ, నామినేషన్ వేయడానికి కానీ తహసీల్దార్ కార్యాలయాలకు రాలేని దద్దమ్మలు మీరేనన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యం ఇబ్బంది పడిందా లేక అసలైన ప్రజాస్వామ్యం ఇబ్బంది పడిందో ఎంపీ అవినాష్‌రెడ్డి చెప్పాలన్నారు. గత 30 సంవత్సరాలుగా, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పులివెందుల నియోజకవర్గంలో ఎటువంటి రాజకీయాలు చేశారో అందరికీ తెలుసన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎంపీడీఓ కార్యాలయాల వద్ద జీపులు అడ్డుపెట్టి కుర్చీలు వేసుకొని కూర్చుని నామినేషన్ వేయడానికి వచ్చిన టీడీపీ నాయకుల నామినేషన్ పత్రాలను గుంజుకొని దౌర్జన్యాలకు పాల్పడింది మీరు కాదా అని ప్రశ్నించారు. నాడు మీరు నేర్పిన పాఠం ప్రకారమే మేము కూడా చేస్తే ఏడుపు గొట్టు మాటలు మాట్లాడడం ఏమిటన్నారు.



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో శనివారం బ్రౌన్ గ్రంథాలయంలో స్వర్గీయ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. అనంతరం ఆయన సభ్యత్వం కార్డు తీసుకున్నారు.



జస్టిస్‌కు బ్రౌన్ గ్రంథాలయ గౌరవ సభ్యత్వ కార్డు అందిస్తున్న దృశ్యం

## దశరథ మహారాజ స్వామి ఆలయం వద్ద భిక్ష

చక్రాయపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దశరథ మహారజస్వామి ఆల యం వద్ద అయ్యప్పమాలధారణ భక్తులకు భిక్ష ఏర్పాటుచేశారు. దేవరగుట్టపల్లె సమీపాన వెలసిన శ్రీరామచంద్రుని తల్లిదండ్రులు కౌసల్య, సుమిత్ర, కైకేయి సమేత దశరథ మహారాజస్వామి ఆలయం వెలసింది. పసుపులేటి శ్రీనివాసులు సతీమణి లక్ష్మీకళ భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రామసుబ్బయ్య, మాజీ సర్పంచు సుబ్బరామయ్య, దశరథ తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజమార్గం: న్యాయమూర్తి

కమలాపురం, రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి లావణ్య తెలిపారు. శనివారం కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 158 కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి తెలిపారు. ఇందులో సివిల్ 7, బ్యాంకు కేసులు 16, క్రిమినల్ 135తో కలిసి కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సర్దుకొని పోవాలన్నారు. పంతాలు, పట్టింపులకు పోతే కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సమస్యలు వచ్చినప్పుడు పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. ఎక్కువ భాగం పొలాల గట్లు, ఇంటి స్థలాలు కేసులు ఉన్నాయని తెలిపారు.

# టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా





కమలాపురం: సభ్యత్వం నమోదు చేయిస్తున్న టీడీపీ నాయకులు... బుగ్గలపల్లె పంచాయతీలో సభ్యత్వ నమోదు

కమలాపురం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని టీడీపీ నాయకుడు, ముస్లిం మైనార్టీ కడప పార్లమెంట్ అధ్యక్షుడు ఖాదర్ బాషా తెలిపారు. శనివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం శాసనసభ్యుడు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం నగర పంచాయతీలోని 15, 16వ బూత్‌లలో 171 మందికి సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ సభ్యత్వం ప్రతి కార్యకర్తకు కొండంత అండగా నిలుస్తుందన్నారు. సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, ఏ కష్టం వచ్చినా ముందుకొచ్చి సమస్యను పరిష్కరిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ అబ్దుల్ నబీ, ఐటీడీపీ టీం సభ్యులు బాబా ఫక్రుద్దీన్, హుస్సేన్ ఖాన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు**

సికెదిన్నె, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీలో పోలిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెయ్యి సభ్యత్వాలు నమోదు చేయించారు. ఐటీడీపీ చాంపియన్ బిట్టి ఆది వెయ్యి సభ్యత్వాలు చేయించడంతోపాటు ఆయన ఆధ్వర్యంలో ఐదు వేల సభ్యత్వాలు నమోదు చేయించడంతో ఆయనను టీడీపీ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పుత్తా గిరి రామమోహన్‌రెడ్డి, బూత్ కన్వీనర్ శ్రీను, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

● ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి




ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగివేమన యూనివర్శిటీ రెండు రోజుల అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. క్రీడా పోటీలను యోగివేమన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి తిలకించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు



ఖాజీపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తూరు సమీపంలో ఉన్నకాశినాయన 28వ ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. వినోదం కోసం చెక్కభజన, ఆరు బృందాలచే కోలాటం, రాత్రి హరికథ నిర్వహించారు.

● **బండలాగుడు పోటీలు..:** ఆరాధనోత్సవాలను పురష్కరించుకుని కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద బండలాగుడు పోటీలు నిర్వహించారు. విజేతలైన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

## రాజీమార్గమే శ్రేయస్కరం

జమ్మలమడుగు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు వారి వారి ఖాతాల్లో నమోదు అయిన కేసుకు సంబంధించి రాజీ మార్గంలో పరిష్కారం చేసుకోవడమే సరైన శ్రేయస్కరమని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి సూచించారు. శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు పరిధిలో ఆయా పోలీసు స్టేషన్లలో నమోదు అయిన కేసుల జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో సాయంత్రం వరకు 1058 కేసులు పరిష్కారం అయినట్లు, 22 అవార్డుల కుగాను రూ.92,02,357 కేసుల రికవరి జరిగిందని లోక్ అదాలత్ సభ్యురాలు సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరి గోవిందరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ సరితారెడ్డి, న్యాయవాదులు భూతమాపురం సుబ్బారావు, పెద్దిరాజు, మహేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HONBLE PRINCIPAL SENIOR CIVIL JUDGE; KADAPA**
I.A.No. 397/2024
I.A.No.849/2012
O.S.No.109/ 2012

Basireddy Ravi Kumar Reddy S/o Basireddy Ramana Reddy, Hindu ,aged about 46 years , residing at D.No: 7/575, Anjaneya Nagar, Badvel, YSR Kadapa District ... Petitioner/Third-party

Vs

1. Shaik Akbar S/o Karimulla, age about 65 years, Business, R/o 110/14, Ameen Peer Road, Kadapa. ... Respondent/Plaintiff
2. Syed Karimunnisa Begum W/o Syed Khaleel, aged about 56 years, Housewife, Muslim, residing at 7/46, Bestavari street, Badvel, Y.S.R Kadapa district. ... Respondent/Defendant

NOTICE

Please take this notice that the above petition filed by the petitioner/ Third party for raising attachment order in the above suit against No:1 and 2 of you, Case stands posted on 20-12-2024 for appearance of No:1 of you before the Hon'ble court at 10.30 AM either by yourself or through your advocate failing which the matter will be decided in your absence.

Advocate for the petitioner/Third party
D.M.Aftab Hussain
T.Venkatesu

**IN THE COURT OF THE HONBLE PRINCIPAL SENIOR CIVIL JUDGE; KADAPA**
I.A.No. 398/2024
I.A.No.849/2012
O.S.No.109/ 2012

Vajjala Chennamma W/o Venkata Swami , Hindu, aged about 59 years , Home Maker Residing at D.No:8/38, Kapu Street Badvel YSR Kadapa District ... Petitioner / Third-party

Vs

1. Shaik Akbar S/o Karimulla, age about 65 years, Business, R/o 110/14, Ameen Peer Road, Kadapa. ... Respondent / Plaintiff
2. Syed Karimunnisa Begum W/o Syed Khaleel, aged about 56 years, Housewife, Muslim, residing at 7/46, Bestavari street, Badvel, Y.S.R Kadapa district. ... Respondent/Defendant

NOTICE

Please take this notice that the above petition filed by the petitioner/ Third party for raising attachment order in the above suit against No:1 and 2 of you, Case stands posted on 20-12-2024 for appearance of No:1 of you before the Hon'ble court at 10.30 AM either by yourself or through your advocate failing which the matter will be decided in your absence.

Advocate for the petitioner/Third party
D.M.Aftab Hussain
T.Venkatesu

**IN THE COURT OF THE HONBLE PRINCIPAL SENIOR CIVIL JUDGE; KADAPA**
I.A.No. 399/2024
I.A.No. 849/2012
O.S.No.109/2012

Basireddy Ramana Reddy, S/o Basireddy Duggireddy, Hindu, aged about 72 years, residing at Anjaneya Nagar, Badvel, YSR Kadapa District. ........Petitioner/Third-party

Vs

1. Shaik Akbar, S/o Karimulla, age about 65 years, Business, R/o 110/14,Ameen Peer Road, Kadapa. ........Respondent/Plaintiff
2. Syed Karimunnisa Begum, W/o Syed Khaleel, added about 56 years,Housewife, Muslim, residing at 7/46, Bestavari street, Badvel, Y.S.R Kadapa district. ........Respondent/Defendant

NOTICE

Please take this notice that the above petition filed by the petitioner/ Third party for raising attachment order in the above suit against No:1 and 2 of you, Case stands posted on 20-12-2024 for appearance of No:1 of you before the Hon'ble court at 10.30 AM either by yourself or through your advocate failing which the matter will be decided in your absence.

Advocate for the petitioner/Third party
D.M.Aftab Hussain
T.Venkatesu

**IN THE COURT OF THE HONBLE PRINCIPAL SENIOR CIVIL JUDGE; KADAPA**
I.A.No. 400/2024
I.A.No.849/2012
O.S No.109/2012

Gottam Sampurnamma W/o G.Srinivasulu , Hindu,aged about 55 years,House wife, R/o D.No:5/22, Reddaiah Mattam Street, Badvel, YSR Kadapa District ....... Petitioner/Third-party

Vs

1. Shaik Akbar S/O Karimulla, age about 65 years, Business, R/o 110/14,Ameen Peer Road, Kadapa. ........Respondent/Plaintiff
2. Syed Karimunnisa Begum W/o Syed Khaleel, added about 56 years, Housewife, Muslim, residing at 7/46, Bestavari street, Badvel, Y.S.R Kadapa district. ........Respondent/Defendant

NOTICE

Please take this notice that the above petition filed by the petitioner/ Third party for raising attachment order in the above suit against No:1 and 2 of you, Case stands posted on 20-12-2024 for appearance of No:1 of you before the Hon'ble court at 10.30 AM either by yourself or through your advocate failing which the matter will be decided in your absence.

Advocate for the petitioner/Third party
D.M.Aftab Hussain
T.Venkatesu

# ప్రశాంతంగా సాగునీటి సంఘం ఎన్నికలు



పోట్లదుర్తిలో అధ్యక్ష,ఉపాధ్యక్షులను అభినందిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం.సురేశ్ నాయుడు, ముద్దనూరులో... చిన్నదుద్యాల నీటి సంఘం అధ్యక్షుడు గాలెం పెద్దగుర్రప్ప, రాజుపాలెం మండలం.. ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకర్ల సంజీవ రెడ్డి

ప్రొద్దుటూరు డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండల పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నిక లు ఏకగ్రీవం అయ్యాయని తహసీల్దారు గంగయ్య తెలిపారు. మైలవరం కెనాల్ సాగునీటి ఆయకట్టు బొల్లవరం - 17 అధ్యక్షుడిగా పల్లేటి అనిల్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి అమర్‌నాథ్ రెడ్డి ఏకగ్రీకంగా ఎన్నికయ్యారు. మైలవరం కెనాల్ ప్రొద్దుటూరు - 19కి అధ్యక్షుడిగా గంగుల రాజేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఏరువ సతీష్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైలవరం కెనాల్ పెద్దశెట్టిపల్లె -20కు ఎద్దుల ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొనిరెడ్డి వెంకటరమణారెడ్డి ఏకగ్రీకంగా ఎన్నికయ్యారు. కేసీ కెనాల్ ఆయకట్టు ఉప్పర పల్లె - 68కి అధ్యక్షుడిగా నారపురెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎదురు మహ్మద్ నూర్ ఏకగ్రీకంగా ఎన్నికయ్యారు. వీరందరికి ఎన్నికల అధికారులు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, రీసర్వే డిటీ సుదర్శన్ తదితరులు ధృవీకరణ పత్రాలు అందజేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**చాపాడు..:** కేసీకెనాల్‌కు సంబంధించిన మొత్తం ఏడు సాగునీటి సంఘాలు ఏకగ్రీవం అయినట్లు చాపాడు చానెల్ ఏఈ గురుమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం 70వ సంఘానికి అధ్యక్షుడిగా నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవీంద్రారెడ్డి, అల్లాడుపల్లె సంఘానికి అధ్యక్షుడిగా ద్వార్శల గురివిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బైరేష్, అనంతపురం 69వ నంబరుకు అధ్యక్షుడిగా వర్రా వీరారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుబ్బరామిరెడ్డి, సోమాపురం అధ్యక్షుడిగా అంకిరెడ్డిపల్లె నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాంప్రసాద్‌రెడ్డి, మడూరు 63వ నంబరు సంఘానికి అధ్యక్షుడిగా నంద్యాల లోకేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా లింగిరెడ్డి రాజారెడ్డి, మడూరు 67వ నంబరుకు అధ్యక్షుడిగా శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ముకుందారెడ్డి, చియ్యపాడు సంఘానికి అధ్యక్షుడిగా ఎస్ఆర్ శివరామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎస్.ఆర్.నారాయణరెడ్డి ఎన్నికైనట్లు ఏఈ తెలిపారు.

**దువ్వూరు..:** మండలంలో జరిగిన సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. శనివారం తహసీల్దారు అక్బల్‌బాష, ఇరిగేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరిగాయి. దువ్వూరు చెరువుకు అధ్యక్షుడిగా లింగమాంబరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరెడ్డి, చింతకుంట చెరువుకు అధ్యక్షుడిగా షరీఫ్, ఉపాధ్యక్షుడిగా జబ్బార్, కేసీ ఆయకట్టు పరిధిలోని దువ్వూరుకు కోనేటి హరినాధ్, జెర్రి హరి, మాచనపల్లెకు సాకం రామసుబ్బారెడ్డి, మిద్దె హుస్సేన్‌బాష, అన్నపుశాస్త్రులపల్లెకు చిన్నక్కగారి వెంకటసుబ్బారెడ్డి, శోభావతి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

**బద్వేలు..:** నియోజకవర్గంలో శనివారం జరిగిన నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 7 మండలాలలో జరిగిన నీటి సంఘం ఎన్నికలలో అన్నిచోట్ల దాదాపు కూటమి అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగియడంతో పోలీసులు, ప్రజాప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు.

**కలసపాడు..:** మండలంలో శనివారం నిర్వహించిన నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు అరింటిలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తహసీల్దార్ మధురవాణి తెలిపారు. తడుకువాగు చెరువుకు గంగసాని వెంకటరెడ్డి, రాచెరువుకు అన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, రెడ్డిపల్లె చెరువుకు పసుపులేటి వీరయ్య, ముద్దిరెడ్డిపల్లె చెరువుకు గురివిరెడ్డి, ఎగువసగిలేరు వాగుకు కొత్తపల్లె చిన్నరంగారెడ్డి, కలసపాడు చెరువుకు ఊటుకూరి పెద్ద వెంకటయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**మైలవరం..:** మండలంలో ఆరు చెరువులకు, మైలవరం జలాశయం డబ్ల్యూఏ-1కు సంబంధించి నీటి సంఘం ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. చైర్మన్లవారీగా కల్లుట్ల నల్లచెరువు చైర్మన్‌గా కె.వెంకటరామిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా కె.జన్నియా, బెస్తవేముల ఎరువ చెరువు చైర్మన్‌గా బి.రాజశేఖర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా దేవేంద్ర, తలమంచిపట్నం కోన అనంతపురం పిన్నయ్యచెరువు నీటి సంఘం చైర్మన్‌గా ఎన్.శ్రీనివాసనాయుడు,వైస్‌చైర్మన్‌గా జి.రామలక్ష్మిరెడ్డి, వెంగక్క చెరువు చైర్మన్‌గా వై.రాజశేఖర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా డి.శ్రీనివాసులు, రామచంద్రాయపల్లె, రేవులపల్లె చెరువు నీటి సంఘం చైర్మన్‌గా పోలు వెంకటన్న, వైస్‌చైర్మన్‌గా చెక్కా వెంకటప్రసాద్, తొర్రివేముల కట్టకింద చెరువు నీటి సంఘం చైర్మన్‌గా టి.నాగార్జున, వైస్‌చైర్మన్‌గా దూదేకుల మహమ్మద్‌గౌస్‌ను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.

● మైలవరం డబ్ల్యూఏ-1 చైర్మన్‌గా నల్లగట్ల చంద్రరామక్రిష్ణారెడ్డి,వైస్‌చైర్మన్‌గా కర్నాటి బసిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**ముద్దనూరు..:** మండలంలోనిచింతకుంట, చిన్నదుద్యాల చెరువులకు సంబంధించి శనివారం నిర్వహించిన నీటి సంఘాల కమిటీ ఎన్నికల్లో బీజేపీకి చెందిన వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతకుంట నీటి సంఘం సంబంధించి బీజేపీ నుంచి 6 గురు నామినేషన్లు దాఖలుచేశారు.చిన్నదుద్యాల నీటి సంఘం సంబంధించి బీజేపీ నుంచి 6 గురు దాఖలు చేశారు.దీంతో ఎన్నికల అధికారులు ముకుందారెడ్డి, నాగేశ్వరనాయక్ ఏకగ్రీంగా ప్రకటించారు.చింతకుంట చెరువు నీటి సంఘం అధ్యక్షుడుగా ఎళ్లిపాలెం సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా సానె గురయ్యను ఎన్నుకున్నారు. చిన్నదుద్యాల చెరువుకు సంబంధించి నీటి సంఘం అధ్యక్షులుగా గాలెం పెద్దగుర్రప్ప, ఉపాధ్యక్షుడుగా భూమిరెడ్డి నాగార్జునరెడ్డిను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

**ఎర్రగుంట్ల..:** మండలంలో శనివారం జరిగిన నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. పోట్లదుర్తి అధ్యక్షుడుగా వెదురూరు పెద్దకొండారెడ్డి, ఉపాధ్యక్షుడుగా పామిడి గోపాల్, హనుమనగుత్తి అధ్యక్ష,ఉపాధ్యక్షులుగా మోపూరి ప్రతాప్‌రెడ్డి, బి.ఈశ్వర్ రెడ్డి, ఇల్లూరు అధ్యక్ష,ఉపాధ్యక్షులుగా వేంపల్లి కొండారెడ్డి, భూమిరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, చిన్నదండ్లూరు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎద్దుల వెంకటసుధాకర్‌రెడ్డి, చిలకల వెంకటసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. వారికి ఎన్నిక నియామక పత్రాలు ఎన్నికల అధికారులు పంపిణీ చేశారు.కాగాటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం.సురేష్ నాయుడు ఏకగ్రీవంగా ఎంపికైన వారిని అభినందించారు.

**పోరుమామిళ్ల..:** పోరుమామిళ్ల చెరువు నీటి సంఘం చైర్మన్‌గా తోటా వెంకటయ్య, వైస్ చైర్మన్‌గా పోతుగంటి బాలాజిరెడ్డి ఎన్నికయ్యారు. రంగ సముద్రం చెరువుకు చెరుకూరి వీరచంద్రాయుడు చైర్మన్‌గా, రుద్రగురయ్య వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దమ్మనపల్లె అయకట్టు చైర్మన్‌గా సందిరెడ్డి పట్టాభిరెడ్డి, వైస్‌చైర్మన్‌గా తోటా జయరామయ్య ఎన్నికయ్యారు. సంచర్ల చెరువుకు చైర్మన్‌గా బోవిళ్ల లక్ష్మీ రెడ్డి, వైస్ చైర్మన్‌గా వైసీపీకి చెందిన పోతుగంటి నన్నె సాహెబ్ ఎన్నికయ్యారు. రామిరెడ్డి కుంట బుచ్చం చెరువుకు సంబంధించి ఆవుల లక్షుమ్మ చైర్మన్‌గా, దుగ్గారి చెన్నయ్య వైస్ చైర్మన్‌గా ఎన్నియ్యారు. బుచ్చం చెరువు నీటి సంఘం అధ్యక్షునిగా దాసరిపల్లెకు చెందిన యనమల చిన్నసుబ్బయ్య, వైస్‌చైర్మన్‌గా తోకలపల్లెకు చెందిన గట్టమనేని మునెయ్యనాయుడు ఎన్నికయ్యారు. రామిరెడ్డి కుంట లక్ష్మంపల్లె చెరువు ఆయకట్టుకు పాల కొలను హర్షవర్ధన్‌రెడ్డి చైర్మన్‌గా, పాలకొలను చంద్రశేఖర్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అముడాలకుంట చెరువు చైర్మన్‌గా పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, దాదం నాగయ్య వైస్ చైర్మన్‌గా ఎన్నియ్యారు. సిద్దవరం చెరువుకు వాకఅన్వేష్ గిరిజకుమారి చైర్మన్‌గా, తిరుపతి బాలుడు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చల్లగిరిగెల ట్యాంకుకు డి.రామక్రిష్ణారెడ్డి చైర్మన్‌గా, డి.చెన్నయ్య వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎల్లువపల్లె చెరువుకు అద్దాల గురవయ్య చైర్మెన్, పెద్ది నాగేశ్వరరావు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వెంకటాపురం చెరువుకు చిట్టిబోయిన బాలయ్య చైర్మన్‌గా, తల్లా వెంకట సుబ్బమ్మ వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు. గానుగపెంటకు నాగుల చెరువు చైర్మన్‌గా నల్ల పెద్దరామయ్య, బి.బాల సుబ్బమ్మ వైస్‌చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

**గోపవరం..:** మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన ఆయకట్టు ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించబడ్డాయి. మండలంలో 10 చెరువులకు సంబంధించి ఆయకట్టు ఎన్నికలను శనివారం నిర్వహించారు. ఇందులో బెడుసుపల్లె బలరామిరెడ్డి , కాలువపల్లె పెద్ది రెడ్డి ఓబుళరెడ్డి, ఏటి కాలువ అధ్యక్షులు జయరాం, గోపవరం రామచంద్రారెడ్డి, చెన్నవరం ప్రతాపరెడ్డి, టి.సండ్రపల్లెకు సత్యనారాయణరెడ్డి, రామాపురం సుధాకర్‌రెడ్డి, బ్రాహ్మణపల్లె లగ్గా రమణయ్య, మడకలవారిపల్లె గంగిరెడ్డి కైవసం చేసుకున్నారు.

**అట్లూరు..:** మండలంలోని 11 చెరువులకు నీటి సంఘాల ఎన్నికలు శనివారం జరిగాయి. టీడీపీ మద్దతుదారులే 11 ఆయకట్టు చెరువులకు 66 మంది టీసీలుగా ఏకగ్రీవంగా నీటి సంఘం ఆయకట్టు రైతులు ఎన్నుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, బద్వేలుసీఐ నాగభూషణం, అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ, గోపవరం ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**బ్రహ్మంగారిమఠం..:** మండలంలో శనివారం 4 నీటి సంఘాల చైర్మన్‌లకు ఎన్నికలు అధికారులు చేపట్టారు. మద్దిరెడ్డిపల్లె నీటి సంఘం చైర్మన్‌గా పెనల ఈశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి , కమ్మవారిపల్లె నీటి సంఘం చైర్మన్‌గా బోయపాటి చంద్రబాబు, వైస్ చైర్మన్ పెద్ద రంగయ్య, లింగాల దిన్నెపల్లె నీటి సంఘం చైర్మన్‌గా సిగినేని గుర్రయ్య, వైస్ చైర్మన్‌గా లెక్కల జయనరసింహారెడ్డి, పలుగురాళ్లపల్లె వాటర్ యూజర్ అసోసియేషన్ లోయర్ సగిలేరు ప్రాజెక్టు చైర్మన్‌గా లగసాని వీరయ్య, వైస్‌చైర్మన్ పోలు ఈశ్వర్‌రెడ్డి, సాగునీటి సంఘాల ఎన్నికలలో మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**మైదుకూరు రూరల్..:** మైదుకూరు కేసీ కెనాల్ సాగునీటి సంఘం ప్రెసిడెంట్ గా చిలుంగారి పెద్ద పుల్లయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా గంగిరెడ్డి చెన్నారెడ్డి ఎన్నికయ్యారు.శివపురం కేసి కెనాల్ సాగునీటి సంఘం ప్రెసిడెంట్‌గా లింగదిన్నె చంద్రఓబుల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అన్నలూరు జ్యోతి , శెట్టివారిపల్లె చెరువు సాగు నీటి సంఘం ప్రెసిడెంట్‌గా పొలిమేర సాంబశివారెడ్డి,వైస్ ప్రెసిడెంట్ అంకిరెడ్డిపల్లె వీరరాఘవరెడ్డి ఎన్నికయ్యారు. తిప్పిరెడ్డిపల్లె గోడేరు చెరువు సాగునీటి సంఘం ప్రెసిడెంట్ పోతురాజు పెద్ద వెంకటయ్య,వైస్ ప్రెసిడెంట్‌గా కశెట్టి నరసింహులు ఎన్నికయ్యారు. తువ్వపల్లె చెరువు సాగునీటి సంఘం ప్రెసిడెంట్ గా చాగనబోయిన సుబ్బరాయుడు,వైస్ ప్రెసిడెంట్‌గా చిన్‌రెడ్డి నారాయణరెడ్డి ఎన్నికయ్యారు. నంద్యాలపేట చెరువు సాగునీటి సంఘం ప్రెసిడెంట్‌గా నేట్లపల్లి లక్ష్మీదేవి, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ హుసేన్‌పీరా ఎన్నికయ్యారు.

**జమ్మలమడుగు..:** జమ్మలమడుగు డివిజన్ పరిధిలో జరిగిన నీటి సంఘం ఎన్నికల్లో ఎక్కడా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా గట్టిగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అందులో భాగంగా జమ్మలమడుగు డివిజన్ కేంద్రమైన ఆర్డీవో కార్యాలయానికి సమీపాన పీఆర్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని డీఎస్పీ వెంకటేశ్వరరావు సందర్శించారు. మేజర్ సంఘాలు నాలుగు, మైనర్ సంఘాలు మూడు, వాటిలో డబ్ల్యూఏ-2 ఎస్.ఉప్పలపాడు గ్రామం ఏకగ్రీవం అయింది. అక్కడ అధ్యక్షుడు టంగుటూరి కర్రయ్యగారి రామోహన్‌రెడ్డి, ఎస్.ఉప్పలపాడు. టీసీ -5 ఉపాధ్యక్షుడుగా మూడబోయిన హరికుమార్ (టీసీ-8 ఎస్.ఉప్పలపాడు)డబ్ల్యూఏ -7 ఎస్.ఉప్పలపాడు ఏకగ్రీవంగా అధ్యక్షుడుగా రాజుపల్లె శివారెడ్డి (టీసీనెం.9), ఉపాధ్యక్షుడుగా ఎ.వెంకటరెడ్డి (టీసీ-12) చిన్నపసుపుల గ్రామం, డబ్ల్యూఏ-12లో గొరిగెనూరు గ్రామం ఏకగ్రీవం. అధ్యక్షుడుగా గోనా లక్ష్మీనరసింహారెడ్డి (టీసీ-4, గొరిగెనూరు), ఉపాధ్యక్షుడుగా గువ్వల చంద్రశేఖర్‌రెడ్డి (టీసీ-9, చలివెందుల), డబ్ల్యూఏ-21 పెద్దదండ్లూరు ఏకగ్రీవం. అధ్యక్షులు తుమ్మలూరు ఆదిలక్షుమ్మ (టీసీ-21, పొన్నతోట గ్రామం), ఉపాధ్యక్షుడుగా బిఆర్.సుబ్బరాయుడు (టీసీ-8, పెద్దదండ్లూరు), గూడెం చెరువు వాటర్ యూజర్ అసోసియేషన్ మైనర్ చెరువు ఏకగ్రీవం. అధ్యక్షుడుగా పోచనబోయిన బాలుగ్రం (టీసీ-5, అనంతగిరి గ్రామం), ఉపాధ్యక్షుడుగా వడ్ల వెంకటసురేష్‌కుమార్ (టీసీ-1), పెద్దచెరువు, సున్నపురాళ్లపల్లె ఏకగ్రీవం. అధ్యక్షుడు ద్వారకచెర్ల సుధాకర్‌రెడ్డి (టీసీ-1, సున్నపురాళ్లపల్లె), ఉపాధ్యక్షుడుగా పూజారి గురుస్వామి (టీసీ-6, సున్నపురాళ్లపల్లె), కోర్లకుంట వాటర్‌యూజర్ సిరిగేపల్లె మైనర్ ఏకగ్రీవం. అధ్యక్షుడు బుక్కే చెంబూనాయక్ (టీసీ-2, సిరిగేపల్లె),ఉపాధ్యక్షునిగా ఎం.చెన్నకేశవులు (సిరిగేపల్లె) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు.

**కాశినాయన..:** మండలంలోని 12 నీటి సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినట్లు ఆయ కట్టు ఎన్నికల బద్వేల్ రెవెన్యూ డివిజన్ నోడల్ అధికారి (ఇరిగేషన్ ఈఈ) క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈఎన్నికల్లో కూటమి అభ్యర్థుల హవా కొనసాగింది.

**బద్వేలు రూరల్..:** నీటిసంఘం ఎన్నికల్లో బద్వేలు పెద్ద చెరువు ఆయకట్టులో 12టీసీలు ఉండగా, 12టీసీలను ఎన్డీఏ కూటమి ఏకగ్రీవంగా కైవసం చేసుకోగా, చైర్మన్‌గా భూమిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, వైస్‌చైర్మన్‌గా దద్దం వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. చిన్నతూము కింద 12టీసీలను ఏకగ్రీవంగా కైవసం చేసుకొని చైర్మన్‌గా కొర్రపాటి సురేంద్ర, వైస్‌చైర్మన్‌గా సిద్దమూర్తి చెన్నారెడ్డి ఎంపికయ్యారు. కోనసముద్రం ఆయకట్టు కింద 6టీసీ చైర్మన్‌గా పైసాని రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్‌గా బీరం నారాయణరెడ్డి ఎంపికయ్యారు. చెన్నంపల్లె ఆయుకట్టు కింద ఉన్న 12టీసీలను ఏకగ్రీవంగా ఎంపికకాగా, చైర్మన్‌గా ఈగ వెంకట రమణారెడ్డి, వైస్ చైర్మన్‌గా గాజులపల్లె వెంకట సుబ్బారెడ్డి ఎంపికయ్యారు.

**ఖాజీపేట..:** మండల పరిధిలోని కేసీ కెనాల్ కింద 72వ డబ్ల్యూఏ అధ్యక్షుడిగా చెంగా చంద్రాయుడు , వైస్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాసులు, 73 డబ్ల్యూఏ అధ్యక్షుడిగా కోనా సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా గంగిరెడ్డి రామిరెడ్డి, 75 డబ్ల్యూఏ వైస్‌ప్రెసిడెంట్‌గా పోలు రమణారెడ్డి, 76 డబ్ల్యూఏ అధ్యక్షునిగా శ్రీనివాసులరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్‌గా ఆవుల మల్లయ్య, 79 డబ్ల్యూఏ ప్రెసిడెంట్‌గా ఎన్.వెంకటేశ్వరరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్‌గా శివతేజ్‌రెడ్డి , 80 డబ్ల్యూఏ అధ్యక్షుడిగా నంద్యాల సుబ్బయ్య, వైస్‌ప్రెసిడెంట్ పిచ్చి నాయుడు, 79 డబ్ల్యూఏ అధ్యక్షునిగా రెడ్యం రవీంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా తవ్వా నవీన్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా కన్నెలవాగు చెరువు చైర్మన్‌గా ఓబుళమ్మ, వైస్‌చైర్మన్‌గా పేతూరు, నాగసానిపల్లె చెరువు చైర్మన్‌గా సూర్యనారాయణ, వైస్‌చైర్మన్‌గా బాలనరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**బి. కోడూరు..:** మండల పరిధిలోని లోయర్ సగిలేరు ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్ కేనల్ నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మున్నేళ్లి నీటి సంఘం అధ్యక్షుడిగా తిప్పలూరు రామ్మోహన్‌రెడ్డి,ఉపాధ్యక్షుడిగా ఓబుల్‌రెడ్డి జనార్ధన్‌రెడ్డి, మేకవారిపల్లె నీటి సంఘం అధ్యక్షుడిగా సిద్దు వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా దుగ్గినేటి సుబ్బరామయ్య ఎన్నికయ్యారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

**రాజుపాళెం..:** మైలవరం, చాపాడు కాలువల ఆయకట్టు సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. కొరపాడు డబ్ల్యూఏ నెంబరు. 26 అధ్యక్షుడు ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, టంగుటూరు డబ్ల్యూఏ నెంబరు 65 కాకర్ల సంజీవరెడ్డి, కొర్రపాడు డబ్ల్యూఏ నెంబరు 16 అధ్యక్షుడుగా గుంటూరు వెంకట రామిరెడ్డి, పొట్టిపాడు అధ్యక్షుడు గోపిరెడ్డి చిన్న నరసింహారెడ్డి, పర్లపాడు కసిరెడ్డి పద్మావతి, పగిడాల విశ్వనాథరెడ్డి, అర్కటవేముల తల్లు చిన్న సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ఎన్నికల పత్రాలు అందజేశారు.

## 'కూటమి ప్రభుత్వంపై విశ్వాసానికి నిదర్శనం'

బద్వేలుటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గవర్గ వ్యాప్తంగా జరిగిన నీటి సంఘం ఎన్నికల్లో కూటమి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహించిన తొలిఎన్నికలు ఈ నీటిసంఘాల ఎన్నికలు అన్నారు. ప్రజల్లో వైసీపీవారికి ఎలాంటి మద్దతులేదని తెలుసుకొని, పోటీచేసినా గెలవలేని పరిస్థితుల్లో ఎన్నికలను బహిష్కరించడం వైసీపీకి పిరికితనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.


## నీటి సంఘం ఎన్నికలలో లోపించిన పారదర్శకత: వైసీపీ

బద్వేలు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలలో పూర్తిగా పారదర్శకత లోపించి అధికార పార్టీకే అధికారులు వత్తాసు పలకడం దారుణమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎన్నికలను ఏకగ్రీవంగా చేసుకోవాలన్న లక్ష్యంతో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అధికారులు ఎన్నికల సమాచారం కూడా అందివ్వలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైసీపీ నేతలు గురుమోహన్, యద్దారెడ్డి, పత్తాశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ : భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలాంటిది అని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. శనివారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పలువురు బాధితులకు అందజేశారు.

## ఒన్‌మీడియా ప్రొడక్షన్ నూతన చిత్రం ప్రారంభం



చిత్ర షూటింగ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్‌కు చెందిన ఒన్‌మీడియా ప్రొడక్షన్ నెంబరు 10 నూతన చిత్ర షూటింగ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ప్రారంభించారు. శనివారం ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో చిత్ర సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, వీఎస్ ముక్తియార్, ఘంటశాల వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు ఆసం సురేష్ రెడ్డి, బచ్చల వీరప్రతాప్, అనిల్, పార్థు, దర్శన్ పాల్గొన్నారు.

## విధులకు రాకుంటే జీతాలు ఎలా వస్తాయి: ఎమ్మెల్యే

చాపాడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సమయానికి విధులకు రాకుంటే ప్రభుత్వం ఎలా జీతాలు చెల్లిస్తుందని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. చాపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమయం 10 గంటలు అయినప్పటికీ డాక్టర్లు రాజేష్‌కుమార్, శ్రీవాణి, పీహెచ్‌వో మహేష్‌యాదవ్ అన్నిటి సర్వే సుకన్య ఎందుకు రాలేదని ఎమ్మెల్యే ఇతర సిబ్బందిని ప్రశ్నించారు. కాగా డీఎంహెచ్‌ఓ నాగరాజు చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నలుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.